
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

బుధవారం 4 జూన్ 2025



ఉష్ణోగ్రత (అంచనా)

4-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	28
తెనాలి	39	28
నరసరావుపేట	39	28
బాపట్ల	39	29
రెంటచింతల	40	29
చీరాల	39	29



రేపు వనమహోత్సవం

- అనంతవరానికి రానున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్
- పార్కులో రెండు వేల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, కలెక్టర్ భార్గవతేజ

తుళ్లూరు (అనంతవరం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజధాని అమరావతి పరిధిలోని అనంతవరంలో గురువారం నిర్వహించే వనమహోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పార్కులో రెండు వేల మొక్కలు నాటనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. దీంతో అనంతవరం ఎన్-15, ఈ-6 రోడ్డు జంక్షన్‌లోని పార్కులో ఏడీసీ, సీఆర్డీఏ, అటవీశాఖ అధికారులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. వెంకటపాలెం సెంట్రల్ పార్కు, పేరేచర్ల నర్సరీల నుంచి అనంతవరానికి మొక్కలను తెప్పిస్తున్నారు. ఆయా ఏర్పాట్లను మంగళవారం తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ పరిశీలించారు.



మొక్కలు నాటే ప్రాంతంలో పనులు చేస్తున్న యంత్రాలు

జీడీసీసీబీకి త్వరలో సభాసంఘం

- రికార్డులు అందుబాటులో ఉంచాలని ఆదేశం
- విచారణకు రానుండటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

గుంటూరు సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీబీ) అక్రమాలపై విచారణకు సభా సంఘం త్వరలో రానున్నది. రికార్డులు అందుబాటులో ఉంచాలని బ్యాంకు అధికారులకు సమాచారం కూడా అందింది. వారం, పది రోజులలోపే సభా సంఘం వచ్చే అవకాశం ఉందని ఉన్నతస్థాయి అధికారులు కూడా ధ్రువీకరించారు. వైసీపీ హయాంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా జీడీసీసీబీలో బోలెడు అక్రమాలు జరిగాయి. 42 జీడీసీసీ బ్యాంకు శాఖలు, 167 సహకార సంఘాల్లో సుమారు రూ.420 కోట్లు గల్లంతైనట్లు ఆరోపణలు ఉన్నాయి. 17 సహకార సంఘాల్లో జరిగిన అవినీతిపై పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. వీటిపై విచారణ చేపట్టాలని సహకార అధికారులు ఉన్నత అధికారులకు లేఖలు రాసినా ప్రయోజనం లేకుండా పోయింది. జీడీసీసీ అక్రమాలపై సభా సంఘం వేయాలని గత అసెంబ్లీ సమావేశాల్లో పొన్నూరు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, బూర్ల రామాంజనేయులు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం సభా సంఘం వేస్తున్నట్లు మార్చి 20న ప్రకటించింది. ఈ సభా సంఘం ప్రస్తుతం విచారణకు రానుండటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



క్రిమినల్ కేసులకు ఉపక్రమించిన సహకార శాఖ

ఇదిలా ఉంటే సహకార శాఖ కూడా జీడీసీసీ అక్రమార్కులపై చర్యలకు ఉపక్రమించింది. 17 సహకార సంఘాల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయటం కలకలం రేపుతుంది. అప్పట్లో వైసీపీ నేతల అడుగులకు మడుగులు ఒత్తిన కొందరు ఇప్పుడు ఏమి తెలియదు అన్నట్లుగా ఉద్యమాలు చేస్తుండటం చర్చకు దారితీస్తుంది.



ఆసనాలు వేస్తున్న విద్యార్థినులు

జీవితకాలం యోగాను ఆచరించాలి

యోగాంధ్రలో టూరిజం స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్

మంగళగిరి సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగాను ఒక్క రోజు మాత్రమే కాకుండా జీవితకాలం ఆచరించాలని ఏపీ టూరిజం అండ్ కల్చర్ స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్ తెలిపారు. యోగాంధ్ర-2025లో భాగంగా మంగళగిరి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఉత్సవ గ్రౌండులో మంగళవారం ప్రత్యేక యోగ శిక్షణా శిబిరం నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, యోగ ఆసనాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అజయ్‌జైన్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు నెల రోజులపాటు ప్రత్యేక యోగ శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ నెల 21న విశాఖపట్నంలో సీఎం చంద్రబాబు సారథ్యంలో ఐదు లక్షల మందితో జరిగే యోగ సాధన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇప్పటికే కోటి 70 లక్షల మంది రిజిస్టర్ అయ్యారని తెలిపారు. వంద పర్యాటక ప్రదేశాల్లో యోగాను ప్రత్యేకంగా చేయిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఆయుష్ విభాగం జిల్లా అధికారి అనిత, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న టూరిజం స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ

వాస్తవాలు.. వక్రీకరణ

- రౌడీషీటర్లకు ఒత్తాసుగా జగన్ పరామర్శ
- అరాచకశక్తులకు అండగా ఉంటాననడంపై విమర్శలు
- 2023లోనే విక్టర్‌పై షీట్ తెరిచినా తాజాగా అని వెల్లడి





జగన్ గారూ... దళిత యువకుడు రవికిరణ్ మృతదేహం ఎక్కడుందో ఆ నేరస్తులను కనుక్కోవాలంటూ ఫ్లెక్సీ పట్టుకుని నిరసనగా తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు



రౌడీషీటర్ లడ్డూతో మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌కు సంబంధాలు ఉన్నాయంటూ ఫొటో చూపుతున్న నాయకులు

తెనాలి, గుంటూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నాలు.. దారిదోపిడీలు.. గంజాయి మత్తులో అరాచకాలు.. జైలుకు వెళ్లివచ్చినా రౌడీషీటర్లలో మారని తీరు.. ఇదీ ప్రశాంత తెనాలిలో పరిస్థితి. కానీ ఈ వాస్తవాలను వక్రీకరిస్తూ మంగళవారం వైసీపీ అధినేత జగన్ పరామర్శ పర్యటన సాగింది. అమాయకపు యువకులని, కక్ష సాధింపుతోనే షీట్ తెరిచారంటూ రౌడీషీటర్లకు మద్దతుగా మాట్లాడటంపై కూడా వివిధ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. చట్టాన్ని రక్షించే పోలీసులపై హత్యాయత్నం చేసిన నిందితులకు వత్తాసు పలుకుతూ పోలీసులకు వ్యతిరేకంగా మాట్లాడటం హేయమని పలువురు అంటున్నారు. పోలీసుల చేతిలో దెబ్బలు తిన్న బాధితులను కాకుండా వారి తల్లి దండ్రులను పరామర్శించడం విచిత్రంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. రౌడీషీటర్లకు అండగా నిలుస్తానంటూ జగన్ ప్రకటించడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రౌడీషీటర్లు నేరాలు చేయడం, అరెస్టయి విడుదలయ్యాక మళ్లీ నేరాలకు పాల్పడటం వంటి సంఘటనలతో పాటు ఐతానగర్‌లో మరికొన్ని ముఠాలు బహిరంగంగానే దాడులకు పాల్పడుతుండటంతో అందరికీ హెచ్చరికలు చేసేలా ముగ్గురు రౌడీషీటర్లను పోలీసులు దండించగా దీనిని వైసీపీ రాజకీయం చేసేందుకే ప్రాధాన్యం ఇచ్చింది. ఈ క్రమంలోనే జగన్ పరామర్శకు వచ్చి వాస్తవాలను వక్రీకరించారని తెనాలివాసులతో పాటు పోలీసు వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రౌడీషీటర్లు దోమా రాకేష్, జాన్‌విక్టర్, కరిముల్లాలు ఐతానగర్‌లో కానిస్టేబుల్ సివిల్ డ్రెస్‌లో ఎవరితోనో గొడవ పడటం చూసి అడ్డు వెళ్లారని ఘటనను ప్రత్యక్షంగా చూసినట్లు జగన్ చెప్పారు. కానీ కానిస్టేబుల్ చిరంజీవి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఈ నలుగురు నిందితులు అతడ్ని చుట్టుముట్టి కొట్టారనేది వాస్తవం. వారికి అతను కానిస్టేబుల్ అనే విషయం తెలియదన్నారు. ఐతే కానిస్టేబుల్ చిరంజీవి ఆరేళ్లుగా ఐతానగర్‌లో నిందితుల్లో దోమా రాకేష్ ఇంటికి దగ్గర్లోనే నివాసం ఉంటుంటే, నవీన్ కూడా అదే వీధిలో ఉంటాడని, వారికి అతను కానిస్టేబుల్ అనే విషయం తెలుసని పోలీసులు చెబుతున్నారు. ఏప్రిల్ 25న కానిస్టేబుల్ మరికొందరు పోలీసులు మంగళగిరి వెళ్లి విక్టర్‌ను, కరిముల్లాను కొట్టుకుంటూ తీసుకొచ్చారన్నారు. కానీ ఈ కేసులో నిందితులను 27న మధ్యాహ్నం 12 గంటలకు లింగారావుపేట సెంటర్లో అరెస్ట్ చేసినట్లు పోలీస్ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. జూన్ 24 రాత్రి కానిస్టేబుల్‌పై దాడి చేస్తే, మరుసటి రోజు వరకు ఎందుకు ఆగారని జగన్ ప్రశ్నించారు. కానిస్టేబుల్‌పై రాత్రి 11 గంటల సమయంలో దాడి జరిగిందని, అన్నీ విచారించుకుని తెల్లవారుజామునే కేసు నమోదు చేశామనేది పోలీసుల మాట. మూడు రోజులు పోలీస్‌స్టేషన్లో, పోలీసుల అదుపులో ఉంచుకుని విక్టర్ జేబులో పోలీసులే కత్తి పెట్టి మధ్యవర్తుల సమక్షంలో పంచనామా రాశారని జగన్ ఆరోపించారు. మధ్యవర్తుల సమక్షంలో విక్టర్ జేబులో కత్తిని స్వాధీనం (మిగతా 8వ పేజీలో)



తెనాలిలో జగన్ పర్యటనలో కార్లపై ఎక్కి నృత్యాలు చేస్తున్న వైసీపీ కార్యకర్తలు



హైవేపై ర్యాంపులు

- పెదకాకాని వద్ద ఇరువైపులా నిర్మాణం
- రూ.9.59 కోట్లు.. ఆరు నెలల్లో పనులు పూర్తి
- కాజా వద్ద సర్వీసు రోడ్డు నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐ నిర్ణయం
- విజయవాడ పోక, అటు నుంచి రాకకు తీరనున్న యూటర్న్ కష్టాలు

గుంటూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని వై జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపైకి ఇరువైపులా గతంలో తొలగించిన ర్యాంపులను మళ్లీ నిర్మించేందుకు ఎన్‌హెచ్ఏఐ నిర్ణయం తీసుకుంది. దీంతో జాతీయ రహదారిపై గుంటూరు నుంచి విజయవాడ వైపునకు, అటు నుంచి గుంటూరులోకి వచ్చేందుకు వాహనదారులు పడుతున్న యూటర్న్ కష్టాలు ఆరు నెలల్లో తీరిపోనున్నాయి. గతంలో ఉన్న ర్యాంపులను ఏ కారణంతోనో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ మూసేసింది. దీంతో గుంటూరు వైపు నుంచి విజయవాడకు వెళ్లాలంటే వాహనదారులు వై జంక్షన్ వద్ద రాంగ్‌రూట్‌లో కొంతదూరం ప్రయాణించి నిబంధనలకు విరుద్ధంగా హైవే పైకి చేరుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలానే విజయవాడ వైపు నుంచి వచ్చేటప్పుడు వై జంక్షన్ బ్రిడ్జి దాటిన తర్వాత ఉన్న ర్యాంపు నుంచి కిందికి దిగి రాంగ్‌రూట్‌లో వెనక్కు వచ్చి గుంటూరు నగరంలోకి ప్రవేశిస్తున్నారు. వీటికి శాశ్వతంగా ఫుల్‌స్టాప్ పెట్టేందుకు రెండు వైపులా ర్యాంపులు నిర్మించేందుకు ఎన్‌హెచ్ఏఐ నిర్ణయించింది. పెదకాకాని వద్ద ఎన్‌హెచ్-16పై 412+300 కిలోమీటర్ వద్ద ఎడమ వైపున ఎంట్రీ ర్యాంపు, కుడివైపున ఎగ్జిట్ ర్యాంపుని నిర్మించేందుకు ఈపీసీ విధానంలో ఎన్‌హెచ్ఏఐ బిడ్‌లను ఆహ్వానించింది. అలానే చిలకలూరిపేట - విజయవాడ సెక్షన్‌లో కాజా గ్రామం వద్ద 421+330 కిలోమీటర్ నుంచి 421+570 కిలోమీటర్ వరకు కుడివైపున సర్వీసు రోడ్డుని నిర్మించబోతున్నది. ఇందుకోసం రూ.9.59 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేసింది. బిడ్‌ని దక్కించుకోబోయే ఏజెన్సీ ఈ రెండు పనులను 180 రోజుల్లో పూర్తి చేయాలి. అలానే ఐదేళ్ల పాటు వాటిని నిర్వహించాలి. ఇందుకోసం మొదటి సంవత్సరం ఎలాంటి ఫీజుని ఎన్‌హెచ్ఏఐ చెల్లించదు. రెండో ఏడాది నుంచి నాల్గో సంవత్సరం వరకు కాంట్రాక్టు మొత్తంలో 0.50 శాతం చొప్పున మెయిన్‌టెనెన్స్ చార్జీలను చెల్లిస్తారు. ఐదో ఏడాది మాత్రం ఒక శాతం చార్జీని ఇస్తారు. ఈ నెల 17 వరకు బిడ్‌లను స్వీకరించి 18న తెరుస్తారు. వై-జంక్షన్ సమీపంలోనే ఎంట్రీ, ఎగ్జిట్ ర్యాంపులు నిర్మించబోతున్నందున చాలావరకు వాహనదారుల సమస్యలు పరిష్కారమౌతాయని అధికారవర్గాలు తెలిపాయి.



ఆవకాయకు కేరాఫ్ పెదపులివర్రు

- నాణ్యత, రుచిలో తగ్గేదే లేదు
- తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాలకు ఎగుమతి

8



ఆధార్ నవీకరణకు అగచాట్లు!

- ప్రైవేట్ కేంద్రాలపై కొరవడిన పర్యవేక్షణ
- ఇష్టారాజ్యంగా డబ్బు వసూలు
- చిన్నపిల్లలతో తల్లిదండ్రుల పడిగాపులు
- చేతులెత్తేసిన ప్రభుత్వ యంత్రాంగం

చంటి పాపతో వచ్చిన మహిళ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకోవాలంటే ఆధార్ తప్పనిసరి. ఆధార్ నవీకరణకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రైవేట్ ఆధార్ కేంద్రాల వద్ద బాలింతలు చంటి పిల్లలతో పడిగాపులు కాస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆధార్ నవీకరించాల్సి ఉండగా యంత్రాంగం చేతులెత్తేసింది. గతంలో పోస్టాఫీసుల్లో ఆధార్ నవీకరణ కేంద్రాలు ఉండేవి. వీటిని కూడా (మిగతా 8వ పేజీలో)



నరసరావుపేటలోని ప్రైవేట్ ఆధార్ కేంద్రంలో చిన్నారులతో తల్లిదండ్రుల పడిగాపులు

కృష్ణానదిపై బ్రిడ్జి!

- ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల- పల్నాడు జిల్లా మాదిపాడు మధ్య నిర్మాణం
- రూ.60.54 కోట్ల వ్యయంతో నెల రోజుల కిందట పనులు ప్రారంభం
- 13 పిల్లర్లతో 14.8 మీటర్ల వెడల్పుతో నిర్మాణం కానున్న బ్రిడ్జి

8

వీసీకి రిజిస్ట్రార్ క్లీన్‌చిట్

- వీసీపై ఆరోపణలు.. రిజిస్ట్రార్ విచారణ
- ఎన్జీ రంగా వర్సిటీలో వెలుగు చూస్తోన్న విచిత్రాలు

8

అత్యాచారం, హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవితఖైదు

6

చరిత్ర సృష్టికి నేటితో ఏడాది

ఉమ్మడి గుంటూరులో కూటమి విజయదుందుబి

గుంటూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా రాజకీయ చిత్రపటంలో చరిత్ర సృష్టించిన రోజు 2024 జూన్ 4వ తేదీ. గత ఎన్నికల్లో 17 అసెంబ్లీ, మూడు లోక్‌సభ స్థానలను నూటికి నూరు శాతం తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీలతో గెలిపించి ప్రజలు కసి తీర్చు కున్నారు. ఎన్టీఆర్, వైఎస్ ప్రభంజనాల్లోనూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒకటి, రెండు స్థానాల ను ఇండిపెండెంట్/ ప్రతిపక్ష పార్టీలు గెలుచుకున్నాయి. 2019 వైసీపీ గాలిలోనూ ఆ పార్టీ రెండు రెండు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానాన్ని కోల్పోయింది. అలాంటిది గత ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ టీడీపీ కూటమి అభ్యర్థులను ప్రజలు ఓట్లేసి గెలిపించారు. ఇందులో టీడీపీ 16, జనసేన ఒకటి గెలుచుకున్నాయి. మూడు ఎంపీ స్థానాలను టీడీపీ అభ్యర్థులు గెలుచుకున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేశ్ 90 వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. గుంటూరు పశ్చిమలో గల్లా మాధవి 55 వేల మెజార్టీ సాధించారు. గుంటూరు పార్లమెంట్‌లో రాజకీయ అరంగేట్రం చేసి తొలి ఎన్నికలోనే డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ 3.44 లక్షల పైచిలుకు మెజార్టీ ఓట్లతో విజయం సాధించారు. బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ 2.08 లక్షలు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు 1.59 లక్షల మెజార్టీలతో గెలుపొందారు. వైసీపీ రాక్షసపాలన అంతమొందిన జూన్4న జిల్లా వ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛందంగా బయటకు వచ్చి బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని, కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఓటర్లు నేడు సంతోషాన్ని పంచుకునేందుకు సన్నద్ధమయ్యారు.



రౌడీమూకలకు పరామర్శపై జగన్ సిగ్గుపడాలి



● మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మే రౌడీ మూకలను పరామర్శించేందుకు తెనాలి వెళ్లిన జగన్ సిగ్గుపడాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. 9 కేసులు ఎదుర్కొంటున్న జాన్ విక్టర్ అమాయకుడైన అడ్వకేట్ అంటూ చెప్పడం జగన్‌కే చెల్లిందన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ రౌడీమూకలతో దాడులు చేయించడమే రాజకీయంగా నడిపిన వ్యక్తి జగన్ అన్నారు. గత ఎన్నికల్లో జగన్ రౌడీ రాజకీయానికి ప్రజలు చెంప చెల్లుమనిపించినా క్రిమినల్ బుద్ధి ఇంకా మారలేదన్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంకుటుంబాన్ని పరామర్శించని జగన్ గంజాయి ముఠా వద్దకు మాత్రం పరిగెత్తుకుని వెళ్లాడని దుయ్యబట్టారు. జగన్‌కు తెలిసిందల్లా అరాచకం, బెదిరింపులు, అవినీతి, విధ్వంసం మాత్రమేనన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటుంటే వారిపైన కూడా విషప్రచారం చేయడం జగన్‌కే చెల్లిందన్నారు.

అవినీతి, వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్ రెడ్డి



● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూన్ 3, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లోనే మోసం, అవినీతి, వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిన ఘనుడు జగన్‌రెడ్డి అని ప్రభుత్వ చీఫ్ విప్ జీ.వి ఆంజనేయులు ధ్వజమెత్తారు. జూన్ -4న వెన్నుపోటు దినంగా నిర్వహించాలని వైసీపీ అధ్యక్షుడు జగన్ ఇచ్చిన పిలుపుపై మంగళవారం ఒక ప్రకటణలో ఆయన తీవ్రంగా స్పందించారు. జగన్‌మోహనరెడ్డి నైజం గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు గతేడాది జూన్-4న ఎన్నికల ఫలితాల్లో తగిన గుణపాఠం నేర్పారని పేర్కొన్నారు. కూటమికి అఖండ మెజార్టీతో ఆశీస్సులు అందించారన్నారు. ఇప్పుడు మద్యం కుంభకోణం బట్టబయలై అరెస్టు భయంతో కొత్త డ్రామాలు మొదలు పెట్టిన అతడు ఉల్టా చోర్ కొత్వాల్‌కు డాంటే అన్నట్లు ప్రజలు, కూటమి ప్రభుత్వంపైకే బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాడని జీ.వి మండిపడ్డారు. ఒక్క చాన్స్ అన్న మాట నమ్మి ప్రజలు అధికారం ఇస్తే 85 శాతం హామీలను ఎగనామం పెట్టిన అసలైన వెన్నుపోటుదారు జగన్ అన్నారు. సొంత బాబాయిని హత్య చేసిన నిందితులను కాపాడడం, ఆస్తి కోసం తల్లినీ చెల్లిని గెంటేయడం, వైఎస్సార్ సీపీని శివకుమార్ నుంచి లాక్కోవడం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్ ప్లాన్ నిధులు రూ. లక్షల కోట్లలో కొల్ల కొట్టడం ఇవేనా జగన్ రెడ్డి అర్హతలని చురకలు వేశారు.

వైఎస్సార్ కడప క్రీడా పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కడప క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 19 లోపు ఏపీ స్పోర్ట్స్ స్కూల్ వెబ్ సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 20 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన, జూలై 1 నుంచి 3వ తేదీ వరకు జిల్లా స్థాయి ఎంపికలు జరుగుతాయన్నారు. జూలై 10న రాష్ట్రస్థాయి ఎంపికలు జరుగుతాయని, వివరాలకు 0863-2221957 నంబరుకు సంప్రదించాలన్నారు.

చిలకలూరిపేటలోని సాయికార్తీక్ సిటీ సెంటర్‌ను ఆక్రమించారు

అక్రమ కేసులు పెడతాం, చంపేస్తామంటూ బెదిరిస్తున్నారు

సీఎం చంద్రబాబునాయుడు మాకు న్యాయం చేయండి

అక్కడికి వచ్చే పరిస్థితి లేక..హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్..

ఎన్నారై, టీడీపీ కార్యకర్త రావి మురళీమోహన్

మా ఆస్తులను టీడీపీ ఎమ్మెల్యే అనుచరులే

కబ్జా చేశారు

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 'పాతికేళ్ల క్రితం అమెరికా వెళ్లా. పైసాపైసా కూడబెట్టి రూ.60 కోట్ల వ్యయంతో సిటీ సెంటర్ పేరుతో రెండు థియేటర్లు, రెండు ఫంక్షన్ హాళ్లు, రెండు అంతస్తుల వాణిజ్య సముదాయాలు నిర్మించా. 30 ఏళ్లుగా తెలుగు దేశం పార్టీ కార్యకర్తగా ఉన్నా. ఎన్‌ఆర్‌ఐగా గత ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేశా. ఇప్పుడు నా సిటీ సెంటర్‌పై సొంత పార్టీకే చెందిన ఎమ్మెల్యే అనుచరుల కన్ను పడింది. సిటీ సెంటర్‌తో పాటు పక్కనే ఉన్న సముదాయాన్ని కబ్జా చేశారు. న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే పట్టించుకోవడం లేదు. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తున్నారు. అక్కడికి వస్తే తప్పుడు కేసులు పెడతాం, చంపేస్తామని బెదిరిస్తున్నారు. నాకు, నా కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉంది. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ స్పందించి నాకు న్యాయం చేయాలి. నా ఆస్తులు నాకు అప్పగించి,రక్షణ కల్పించాలి' అని ఓ ఎన్‌ఆర్‌ఐ వేడుకున్నారు.

మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో చిలకలూరిపేటకు చెందిన ఎన్‌ఆర్‌ఐ రావి మురళీమోహన్, తన తల్లిదండ్రులు రావి సుధాకర్, రావి సామ్రాజ్యంతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. తాను పాతికేళ్ల క్రితం అమెరికా వెళ్లానని, అక్కడ పైసాపైసా కూడబెట్టి చిలకలూరిపేటలో స్థలాన్ని కొనుగోలు చేసి, బ్యాంకు రుణాలతో సుమారు రూ.60 కోట్ల వ్యయంతో 2017లో సాయికార్తీక్ సిటీ సెంటర్ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించానని తెలిపారు. అందులో రెండు సినిమా థియేటర్లు, రెండు ఫంక్షన్ హాళ్లు, రెండు అంతస్తుల వాణిజ్య సముదాయాలు ఉన్నాయని తెలిపారు. తన కాంప్లెక్స్‌ను గతేడాది ఆగస్టు 5న స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అనుచరులు కబ్జా చేశారని ఆరోపించారు. తన తండ్రి కందిమళ్ల అంజిబాబు అనే వ్యక్తి నుంచి రూ.97 లక్షలు అప్పు తీసుకున్నారని, ఇందుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు ఆక్రమణదారులు అందించలేదన్నారు. తనకు అప్పుతో సంబంధం లేదని చెప్పారు. అప్పు తీసుకున్న మాట నిజమైతే దానిని చెల్లించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఆర్థిక లావాదేవీల్లో ఏమైనా తేడా ఉంటే కూర్చుని మాట్లాడుకుంటే సరిపోతుందన్నారు. కానీ, తన కాంప్లెక్స్‌ను ఆక్రమించిన వ్యక్తులు లోపలికి ఎవరినీ అనుమతించడం లేదని, కాంప్లెక్స్ ముందు టెంట్ వేసుకుని కొంతమంది నిత్యం కూర్చుంటున్నారని తెలిపారు. కాంప్లెక్స్‌లో అద్దెకు ఉంటున్న వారిని భయభ్రాంతులకు గురిచేసి బయటికి వెళ్లగొట్టారని చెప్పారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని, హైకోర్టును ఆశ్రయించగా అప్పుడు కేసు నమోదు చేశారని తెలిపారు. అయినా కూడా పోలీసులు ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. గతేడాది ఆగస్టు 23న కాంప్లెక్స్‌లో సీసీ కెమెరాలను కూడా పగులగొట్టారని చెప్పారు. తాము 100 నంబరుకు ఫోన్ చేసినా, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా, రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని తెలిపారు. మళ్లీ హైకోర్టును ఆశ్రయించగా.. గతేడాది నవంబరులో రక్షణ కల్పించాలని ఆదేశించినా పోలీసులు పట్టించుకోలేదని చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు తాము మళ్లీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని, సినిమా థియేటర్‌లో చిత్రాలు నడవడానికి కూడా రెండు సినిమాలు బుక్ చేసుకున్నామని తెలిపారు. కబ్జాదారులు తమతో పాటు అక్కడికి వచ్చిన వారిని బెదిరించి, కాంప్లెక్స్ అద్దాలు పగులగొట్టి భయభ్రాంతులకు గురిచేశారని వివరించారు. దీంతో ఫిబ్రవరిలో మళ్లీ హైకోర్టులో కోర్ట్ ధిక్కరణ పిటిషన్ వేశామని చెప్పారు. స్థానిక సీఐ రమేష్ అక్కడ ఏమీ జరగడం లేదని న్యాయస్థానానికి తప్పుడు అఫిడవిట్ ఇచ్చాడని ఆరోపించారు. తమను కాంప్లెక్స్‌లోకి వెళ్లనివ్వడం లేదని, తన తండ్రిపై అక్రమ కేసులు పెట్టారని, తాను వస్తే మాదక ద్రవ్యాల కేసు పెడతామని, రహదారిపై దుస్తులు ఊడదీసి కొడతామని హెచ్చరించారని తెలిపారు.



సమావేశంలో తల్లిదండ్రులు రావి సుధాకర్,రావి సామ్రాజ్యంలతో కలిసి వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు ఎన్నారై, టీడీపీ కార్యకర్త రావి మురళీమోహన్

కాంప్లెక్స్ కబ్జా కారణంగా అందులో పనిచేసే 40 మందికి పైగా ఉద్యోగులు జీవనోపాధిని కోల్పోయారని, పక్కనే తన భార్య పేరు మీద ఉన్న ఐస్ ఫ్యాక్టరీ కూడా మూతపడటంతో అక్కడి కార్మికులు ఉపాధి, ఆదాయం కోల్పోతున్నారని చెప్పారు. కేసుల భయంతో తన తండ్రి హైదరాబాద్ కు వచ్చి ఉంటున్నారని, తన తల్లి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుందని ఆమె ఒక్కతే అక్కడ ఒంటరిగా నివసిస్తుండగా.. ఆక్రమణదారులు ఆమెకు ఆహారం, ఔషధాలు అందకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. సీసీ కెమెరాల వైర్లు ధ్వంసం చేసి, ఇంటర్నెట్ సౌకర్యం నిలిపివేసి ఆక్రమణదారులు తమ ఆస్తిని పూర్తిగా తమ నియంత్రణలోకి తీసుకున్నారని తెలిపారు. పలుమార్లు చిలకలూరిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు దీనిని సివిల్ విషయంగా పరిగణించి చర్యలు తీసుకోలేదన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్, హైకోర్టును ఆశ్రయించానని వెల్లడించారు. కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చినప్పటికీ స్థానిక పోలీసులు దానిని అమలు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అనుచరుల ప్రమేయం కారణంగా పోలీసులు సహకరించడం లేదని, తనపై, కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు పెడుతూ, చంపేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. తనను ఎన్ కౌంటర్ చేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. తమ ఆస్తి కబ్జా, బెదిరింపులపై తమ పార్టీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశామన్నారు. తన కుటుంబం ఆర్థికంగా, మానసిక చిలకలూరిపేటకు పోలేక తల్లిని హైదరాబాద్‌కు పిలిపించుకుని ఈ సమావేశం పెట్టినట్లు చెప్పారు. న్యాయ పోరాటం కొనసాగిస్తానని, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ తమకు న్యాయం చేస్తారనే నమ్మకం ఉందని తెలిపారు.

అత్యాచారం, హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవితఖైదు

మాచర్ల రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం నాగులవరం పంచాయతీ పెద అనుపు చెంచుకాలనీలో అత్యాచారం, హత్యకు గురైన ఆశావర్కర్ రమావత్ నీలావతి కేసులో ముగ్గురు నిందితులకు కోర్టు జీవితఖైదు విధించడం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మాచర్ల మండలం పెద అనుపు చెంచు కాలనీకి చెందిన రమావత్ నీలావతి (46) కొప్పునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అనుపు, బీకేవీ పాలెం చెంచు కాలనీల్లో ఆశ వర్కరుగా విధులు నిర్వహిస్తోంది. 2022 సెప్టెంబరు 16న సాయంత్రం 6 గంటలకు భర్త లస్కర్ నీలావతితో మాట్లాడి పొలానికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం ఇంటికి రాగా నీలావతి ఇంట్లో కనిపించలేదు. నీలావతి తండ్రి లాలుతో కలిసి గ్రామంలో విచారించారు. రాత్రి తమ ఇంటి వైపు నీలావతి వచ్చిందని సెల్‌ఫోన్ పోయిందని చెప్పిందని మండ్లి ముత్తయ్య అనే వ్యక్తి వారికి చెప్పాడు. అదే సమయంలో బీకేవీ పాలేనికి చెందిన చావిటి చిన అంజి, శీలం అంజి, బైస్వామి కూలీ డబ్బులు కోసం తన వద్దకు వచ్చారని తెలిపాడు. ఆ ముగ్గురు బీకేవీపాలెంలో ఉన్న వెంకన్న అనే వ్యక్తి పోయిన సెల్‌ఫోన్ ఎక్కడుందో కనిపెడతాడని చెప్పడంతో నీలావతి ఆ గ్రామానికి వెళ్లిందని చెప్పాడు. దీంతో భర్త లస్కర్, గ్రామస్తులు వెంకన్నను విచారించగా తన వద్దకు వచ్చిన మాట వాస్తవమేనని, సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ అయిందని, తరువాత రోజు వస్తే చూస్తానని చెప్పడంతో నీలావతితోపాటు ఆ ముగ్గురు వ్యక్తులు నడుచుకుంటూ వెళ్లారని చెప్పాడు. గతంలో నేర చరిత్ర ఉన్న చావిటి చిన అంజి, శీలం అంజిలను గ్రామస్తులు ఘట్టిగా ప్రశ్నించడంతో ముగ్గురం అత్యాచారం చేశామని, నీలావతి గొడవ చేయడంతో రాయితో తలపై కొట్టడంతో మృతి చెందిందని చెప్పారు. రోడ్డు పక్కన సమీపంలో రెండు బండరాళ్ల మధ్య నీలావతి మృతదేహాన్ని ఉంచి తాటాకులు కప్పినట్లు చెప్పి ఘటనా ప్రదేశాన్ని చూపారు. విషయాన్ని లస్కర్, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో చావిటి చిన అంజి, శీలం అంజి, బైస్వామిలను అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి భర్త లస్కర్ ఫిర్యాదు మేరకు అప్పటి విజయపురిసౌత్ ఎస్ఐ అనిల్‌కుమార్‌రెడ్డి నిందితులపై క్రైం నంబరు 82బై2022 సెక్షన్ 376డి, 376ఏ, 302, 201బై34ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గుంటూరు అడిషనల్ జడ్జి కె.నీలిమా నిందితులపై నేరారోపణ రుజువు కావడంతో ముగ్గురికి జీవిత ఖైదు, రూ.70 వేల చొప్పున జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.



శీలం బైస్వామి (ఫైల్)



చావిటి చిన అంజి (ఫైల్)



శీలం అంజి (ఫైల్)

జగనాసుర పీడ విరగడై ఏడాది!

- గురజాల ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జగనాసుర వధ జరిగి.. సైకో ప్రభుత్వం గద్దె దిగి ప్రజా ప్రభుత్వం ఎన్డీఏ అధికారం చేపట్టి నేటికి సంవత్సరం అయిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వన్‌సైడ్ మెజార్టీతోనే 164 సీట్లతో అధికారంలోకి వచ్చిన రోజు, ఆర్థిక వ్యవస్థ పతనం కావడానికి కారకుడైన జగన్‌మోహన్‌రెడ్డి గద్దె దిగిన రోజు.. ఒక పండుగ రోజు అన్నారు. ఎన్డీఏ శ్రేణుల్లో ఒక పండుగ లాంటి వాతావరణం జరుపుకునే పరిస్థితి ఆంధ్ర రాష్ట్రంలో ఉందన్నారు. కానీ, ఈ నయవంచక వైసీపీ నాయకులు దానిని వెన్నుపోటు దినంగా బావిస్తున్నారన్నారు. తల్లిని, చెల్లిని వంచించిన వాడు అసలు సిసలైన వెన్నుపోటు దారుడని, బాబాయిని గొడ్డలి పోటుతో చంపి గుండెపోటు అని నమ్మించే ప్రయత్నం చేసిన జగన్ నిజమైన వెన్నుపోటుదారుడు అని యరపతినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెనాలిలో గంజా యి తాగి కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తులను జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించడం దేనికి సంకేతమో వైసీపీ నాయకులు తెలపాలన్నారు.

వెన్ను పోటు, గొడ్డలి వేటు పేటెంట్ జగన్‌రెడ్డిదే



ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వెన్నుపోటు, గొడ్డలి వేటు పేటెంట్ జగన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుంభ కోణాల నుంచి ప్రజా దృష్టి మరల్చడానికి ధర్నాల డ్రామాను జగన్ ముఠా ఆడుతోందన్నారు. తొలి ఏడాదిలో పది శాతం హామీలను కూడా గత ప్రభుత్వం అమలు చేయలేదని గుర్తుచేశారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలో 70 శాతం హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఐదు సంవత్సరాల్లో 85 శాతం హామీలకు జగన్ ప్రభుత్వం యగనామం పెట్టిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకొని రూ.లక్షల కోట్లు దోచుకొని అదే పార్టీకి వెన్ను పోటు పొడిచి వైసీపీ పార్టీని జగన్ స్థాపించాడన్నారు. శివ కుమార్ స్థాపించిన వైసీపీని జగన్ కబ్జా చేసి వెన్ను పోటు పొడిచాడన్నారు. ఎత్తుకొని పెంచిన బాబాయిని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకులను కాపాడుతూ రక్త సంబంధానికి వెన్ను పోటు పొడిచారన్నారు. ఆస్తి కోసం తల్లిని, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి కుటుంబ వ్యవస్థకే వెన్ను పోటు పొడిచాడన్నారు. మెగా డీఎస్సీ పై మాట తప్పి యువతకు వెన్ను పోటు పొడిచాడన్నారు.

సైకోలను పరామర్శించడం సిగ్గుచేటు



ఎమ్మెల్యే నరేంద్ర

పొన్నూరుటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పులివెందుల శాసనసభ్యుడు జగన్‌రెడ్డి తెనాలిలో గంజాయి సైకోలను పరామర్శించడం సిగ్గుచేటని ఎమ్మెల్యే, సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మంగళవారం అన్నారు. మరోసారి సైకోలను మానసికంగా జగన్‌రెడ్డి సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. జగన్ పర్యటన సందర్భంగా పోలీస్ వాహనంపైకి ఎక్కి హల్‌చల్ చేయడం జగన్ 2.0కి నిదర్శనమన్నారు. తెనాలిలలో సైకోల వికృత చేష్టలకు ప్రజలు భయాందోళనలు ఉన్నాయన్నారు. ప్రజలు జగన్‌రెడ్డిని ఓడించినా ఆయన వైఖరిలో మార్పు రాలేదన్నారు. జగన్ లాంటి వ్యక్తులకు ప్రజల్లో తిరిగే నైతిక హక్కు.. ప్రజాస్వామ్యంలో ఉండే హక్కు లేదన్నారు. 2.0 చూపిస్తానంటూ సైకోలను ఉసిగొలిపి అరాచకాలను మళ్లీ మొదలు పెట్టే ప్రయత్నం జరుగుతోందని హెచ్చరించారు. పోలీస్ వాహనం పైకి ఎక్కి హల్ చల్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు.

రేపు జీడీసీసీ బ్యాంకు చైర్మన్

మక్కెన ప్రమాణ స్వీకారం

గుంటూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. డీసీసీబీ చైర్మన్‌గా మక్కెనను నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు విడుదలైన విషయం తెలిసిందే. ఉదయం 11 గంటలకు గుంటూరు బ్రాడీ పేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుందని అధికారులు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లాలోని ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా హరిబాబు

జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా వడ్రాణం హరిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లా కోర్టు రోడ్డులోని డీసీఎంఎస్ కార్యాలయంలో ఆయన అధికారుల నుంచి బాధ్యతలు తీసుకుంటారు. చైర్మన్ హరిబాబుకు ఈ నెల 14న ఆత్మీయుల అభినందన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనదారుడిపై దారి దోపిడీ

- నిందితుడికి 21 ఏళ్లు..నాలుగు జిల్లాల్లో 27 కేసులు

ప్రత్తిపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నగదు కోసం ద్విచక్ర వాహనదారుడిపై ముగ్గురు యువకులు దారి దోపిడీకి పాల్పడిన ఘటన మంగళవారం ఉదయం నిమ్మగడ్డవారిపాలెంలో చోటు చేసుకుంది. తుమ్మలపాలేనికి చెందిన శాకమూరి శ్రీనివాసరావు తన గొర్రెల వద్దకు వెళ్తుండగా అతనిపై దాడి చేసి, జేబులోని నుంచి రూ.3,500 నగదు లాక్కుని నంబరు ప్లేటు లేని బైక్ పై అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితుడు విషయాన్ని బంధువులకు తెలపడంతో అప్రమత్తమయ్యారు. దుండగులు ముగ్గురూ బోయపాలెం వద్ద మద్యం దుకాణంలో మద్యం తాగుతుండగా.. వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఒకరిని దొరకబుచ్చుకోగా ఇద్దరు పరారయ్యారు. అతనిని ప్రత్తిపాడు పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వ్యక్తి నరసరావుపేటకు చెందిన దేవర భవానీ ప్రసాద్‌గా గుర్తించారు. అతని వయస్సు 21 సంవత్సరాలు. అతనిపై నాలుగైదు జిల్లాల పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్‌లలో 27 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'ఏటీఎం' దొంగ అరెస్ట్



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుడు సురేష్ (రెడ్ టీ షర్ట్ వ్యక్తి)

తాడేపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంల వద్ద కాపు కాసి నగ దు తీయడం రాని వారిని మోసం చేసే వ్యక్తిని మంగళవారం తాడే పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ ప్రతాప్ వివరాల మేరకు.. ఉండవల్లి కూడలిలో ఏసీబీఐ బ్యాంకు ఏటీఎం వద్ద ఓ వృద్ధురాలి ఏటీఎం కార్డును ఓ వ్యక్తి మారుస్తున్న సమయంలో పక్క నే ఉన్న బ్యాంకు సిబ్బంది గమనించారు. సదరు వ్యక్తిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. నిందితుడు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీం పట్నం ప్రాంతానికి చెందిన పి.సురేష్ గా గుర్తించారు. అతను ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని, గతంలోనూ సురేష్‌పై పలు కేసులు ఉన్నాయని వెల్లడించారు.

ఏఎన్‌యూ పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ మొదటి సెమిస్టర్ పరీక్ష ల ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివ ప్రసాదరావు వివరాలు వెల్లడించారు. ఎంఏ ఆర్కియాలజీ, ఎకనమిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, డ్యాన్స్, అప్లైడ్ లింగ్విస్టిక్స్, ఎంసీఏ పీజీ కోర్సులతో పాటు డిప్లొమా ఇన్ ఫొటోగ్రఫీ ఫలితాలను సైతం వెలువరించామని సీఈ పేర్కొన్నారు. పునః మూల్యాంకనం కోసం జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఇటీవల జరిగిన పీజీ ఫలితాలు కూడా అతి త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

ఏఐ పరిశోధనలకు డాక్టరేట్



మల్లికార్జునరావును అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు

పెదకాకాని, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటిలి జెన్స్) పై ఏఎన్‌యూలో పరిశోధనలకు వీవీఐటీ కళాశాల సహాయ ఆచార్యులు సింహాద్రి మల్లికార్జునరావు డాక్టరేట్ పొందారు. ఏఎన్‌యూలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో వర్సిటీ తాత్కాలిక వీసీ ఆచార్య కంచర్ల గంగాధర్‌రావు స్వీయ పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిగిందని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ సింహాద్రి మల్లికార్జునరావు మాట్లాడుతూ తన పరిశోధన గ్రంథంలో పలు జాతీయ, అంతర్జాతీయ వ్యాసాలు ప్రచురితమైనట్లు పేర్కొన్నారు.

ఈజిప్టులో అఖిలపక్ష బృందం



కైరోలోని జమాలెక్‌లో అల్-హొర్రెయా పార్కులో మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్న అఖిలపక్ష ఎంపీల బృందం

నరసరావుపేట టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు వ్యూహాత్మక ప్రణాళికతో ప్రపంచ పర్యటన నిర్వహిస్తున్న అఖిలపక్ష బృందాల్లో ఒకటైన సుప్రియా సూలే నేతృత్వంలోని బృందం మంగళవారం ఈజిప్టులో పర్యటించింది. ముందుగా కైరోలోని జమాలెక్‌లోని అల్-హొర్రెయా పార్కులో మహాత్మా గాంధీకి ఈ ప్రతినిధి బృందం నివాళులర్పించింది. ఈ బృందం ఆ దేశంలోని ప్రస్తుత, మాజీ మంత్రులు, ప్రముఖ రచయితలు, సమాజికర్తలు, నాయకులతో సహా ఈజిప్టులోని కీలక సంభాషణ కర్తలతో కూడా చర్చలు జరుపుతోంది. ఉగ్రవాద నిరోధకతపై సన్నిహిత ద్వైపాక్షిక సహకారం గురించి వివరిస్తూ దేశ సహకారాన్ని కోరుతున్నారు. బృందంలో ఎంపీలు సుప్రియా సూలే, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఉన్నారు.

పరువు గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు: గాదె



సమావేశంలో మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు, పార్టీ శ్రేణులు

తెనాలిరూరల్, జూన్3(ఆంధ్రజ్యోతి): ఐతానగర్‌లో రౌడీయిజాన్ని పెంచేలా పాలన చేసింది జగన్ ప్రభుత్వమేనని.. కూటమి రావడంతో వాటిని అనగదొక్కుతుంటే నీచరాజకీయాలకు తెరలేపి కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైసీపీ పూనుకోవడం బాధాకరమని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. జగన్ తెనాలి పర్యటనను ఖండిస్తూ పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. గతంలో ఏ రాజకీయ నాయకుడు చేయని విధంగా జగన్ తెనాలిలో పర్యటించి రౌడీషీటర్లకు మద్దతుగా నిలిచారన్నారు. ఒకప్పుడు ఐతానగర్ పేరు చెబితే ఎంతో ప్రశాంతంగా ఉండేదని వైసీపీ ఐదేళ్ల పాలనలో రౌడీలకు, మహిళలపై హత్యాచారాలకు, దోపిడీలకు, గంజాయికి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆరోపించారు. మంత్రి మనోహర్ రౌడీయిజం, గంజాయి, అసాంఘిక కార్యకలాపాలను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించవద్దని పోలీస్ శాఖకు కచ్చితమైన ఆదేశాలిచ్చారన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెనాలి శ్రావణ్‌కుమార్

పరామర్శల పేరుతో జగన్ కొత్త నాటకం

● ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

గుంటూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పరామర్శల పేరుతో కొత్త నాటకానికి తెరలేపారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ అరాచక పాలనకు ఐదేళ్లపాటు ఏపీలో ప్రజలు కకావికలమైపోయారన్నారు. వెన్నుపోటు దినోత్సవం అంటూ ప్రజలలోకి రావటానికి మరో కొత్త నాటకానికి తెరలేపారన్నారు. కాంగ్రెస్‌ను అడ్డం పెట్టుకుని రూ.లక్షల కోట్లు దోచుకుని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీ పార్టీని స్థాపించారన్నారు. అక్రమ మద్యంతో ప్రజల ప్రాణాలను గాలిలో దీపాలు చేసి పేదల రక్తాన్ని తాగి వారికి వెన్ను పోటు పొడిచారన్నారు. తాము అధికారంలోకి రాగానే 1వ తేదీనే 4 వేలు పెన్షన్లు పంపిణీ... 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. గంజాయి ముఠాను పరామర్శించడానికి తెనాలి పర్యటనకు జగన్మోహన్ రెడ్డి రావడం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ ఛైర్మన్ దాసరి రాజామాష్టారు మాట్లాడుతూ కడప మహానాడు చూసిన తర్వాత జగన్‌కు మతి భ్రమించినట్లుందని అన్నారు. కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, నూతలపాటి రామారావు, దామచర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి నీతి వాక్యాలా?

● జగన్‌పై ఉన్న కేసులకు ఇతర దేశాల్లో కాల్చిపారేస్తారు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సంచలన వ్యాఖ్యలు

గుంటూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 36 కరుడుగట్టిన కేసులున్న ఇదే జగన్మోహన్‌రెడ్డిని ఇతర దేశాలలో అయితే కాల్చేసేవాళ్లని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సంచలన వ్యాఖ్యలు చేసారు. కేసులు ఉంటే కొడతారా అని జగన్మోహన్ రెడ్డి మాట్లాడడం చూస్తే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి నీతి వాక్యాలు చెప్పినట్లు విడ్డూరంగా ఉందని అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నేత జగన్మోహన్‌రెడ్డి తెనాలి పర్యటనలో పరామర్శ పేరుతో తానేదో శాంతి కాముకుడు అన్నట్లు మాట్లాడటం చూస్తే న్యాయవ్యవస్థ సిగ్గుపడుతుందన్నారు. గత జగన్ రెడ్డి పాలనలో వైసీపీ ఎంపీగా ఉన్న రఘురామకృష్ణంరాజును సీఐడీ పోలీసులు విచారణ పేరుతో చేసిన అరాచకం గుర్తులేదా? అని ప్రశ్నించారు. జాన్ విక్టర్ అనే సంఘ విద్రోహ శక్తిపై 21 కేసులు నమోదయ్యాయి. అలాంటి వారిని మహాత్మాగాంధీ వారసుల మాదిరిగా పరామర్శకు జగన్మోహన్‌రెడ్డి రావడం సిగ్గుపడాల్సి వస్తోందన్నారు. చంద్రబాబుపై 24 కేసులున్నాయి. చంద్రబాబుని కూడా కొడతారా అని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్న జగన్ అవి తాను పెట్టిన కేసులే అని మర్చిపోకూడదని గుర్తుచేశారు. తెనాలి ఘటనలో దెబ్బతిన్న పోలీసు కుటుంబాలను పరామర్శించనందుకు జగన్మోహన్ రెడ్డి క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

జేఈఈ అడ్వాన్సులో శ్రీ చైతన్య జయభేరి

గుంటూరు (విద్య) జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో శ్రీ చైతన్య విద్యార్థులు విజయభేరీ మోగించారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జోన్‌లో ఎన్.హేమంత్ అభిరామ్ 44వ ర్యాంకు, జై.రుద్రతేజ 309, బి.రాజు 378, జి.వైష్ణవి 405, కే.హర్షవర్ధన్ 414, ఎండి తభిషా అయుమన్ 674 ర్యాంకులు సాధించారని తెలిపారు. తమ విద్యార్థులు 1000 లోపు ర్యాంకులు 21 మంది, 2000 లోపు 34 మంది, 5000 లోపు 66 మంది, పదివేల లోపు ర్యాంకులు 127 మంది సాధించారని వివరించారు. విద్యార్థినీ, విద్యార్థులను అకాడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ, ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్, డీన్స్ సురేష్, చంద్రశేఖర్, కృష్ణ, హరిబాబు ఎల్బిసి శ్రీనివాస్ తదితరులు అభినందించారు



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తదితరులు

టీడీపీపైనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనుగడ

● ఏపీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి తదితరులు

గుంటూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని టీడీపీపైనే మనుగడ సాగిస్తోందని.... ఇప్పుడైనా రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నిధులను సాధించుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, ఏపీసీసీ అధికార ప్రతినిధి ఎన్ తులసిరెడ్డి డిమాండ్ చేశారు. గుంటూరు పర్యటనకు వచ్చిన ఆయన ఇక్కడ రాజీవ్‌గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయి 11 ఏళ్ళు గడిచినా కనీసం విభజన చట్టంలోని అంశాలను అమలు చేయటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కనీసం ఇప్పుడైనా చట్ట ప్రకారం రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నిధులను టీడీపీ రాబట్టాలని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ పాలనకు, ఇప్పటి కూటమి పాలన చూస్తుండే దొందూ దొందే అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. తెనాలిలో రౌడీషీటర్లపై పోలీసుల థర్డ్ డిగ్రీ ఘటనపై స్పందించిన తులసీరెడ్డి పోలీసులు చట్టాన్ని చేతిలోకి తీసుకొని చిత్ర హింసలు పెట్టకూడదని, పరామర్శించే హక్కు ఎవరికైనా ఉంటుందన్నారు. పోలీసులకు అధికారం ఉంది అని అన్నింటికి రౌడీషీట్లు తెరిచి చిత్ర హింసలు పెట్టటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. మీడియా సమావేశంలో ఏపీసీసీ నాయకులు కొరివి వినయ్‌కుమార్, గద్దం పాల్ విజయ్‌కుమార్, బిళ్ళా సునీల్ , కరిముల్లా తదితరులున్నారు.

గాయపడిన జన సైనికుడికి రూ.2.50 లక్షల సాయం

గుంటూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలును కోల్పోయిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ జనసేన పార్టీ క్రియాశీల సభ్యుడు చల్లా శివశంకర్‌రావుకు జనసేన పార్టీ ఆర్థికసాయం అందజేసింది. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల ప్రకారం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మంగళవారం స్వయంగా జనసైనికుడు శివశంకరరావు ఇంటికి వెళ్లి పార్టీ తరఫున రూ.2.50 లక్షల చెక్‌ను అందజేశారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శిఖా బాలు, చట్టాల త్రినాథ్, జెట్టి బాబు, జడ సురేష్, ఇమ్మిడి నవీన్, మిరియాల రంజిత్, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

2030 నాటికి క్షయరహిత భారత్ ఆవిష్కరణ

● కలెక్టర్ భార్గవ్ తేజ వెల్లడి

గుంటూరు మెడికల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 2030 నాటికి దేశంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు కలెక్టర్ భార్గవ్‌తేజ వెల్లడించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో టీబీ ముక్త భారత్ అభియాన్ పోస్టర్లను, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలలో భాగంగా జిల్లాలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటి సర్వే నిర్వహించి హైరిస్క్ పాపులేషన్‌కు క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్షల్లో ఎవరికైనా క్షయ సోకినట్లు తేలితే వారికి ఆరు నెలల పాటు ఉచితంగా చికిత్సలు అందజేస్తామన్నారు. చికిత్స సమయంలో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కోసం రూ.వెయ్యి ప్రతి నెల వారి బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తామని కలెక్టర్ భార్గవ్‌తేజ తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కేవిజయలక్ష్మి మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి ఇంటింటి సర్వేను విజయవంతం చేసేందుకు ఆరోగ్య సిబ్బంది కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భూక్యా లక్ష్మానాయక్, టీబీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వి రాజశేఖర్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ కే రాంబాబు, బేబీ స్వరూపారాణి, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ భార్గవ్‌తేజ తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, హాజరైన కమిషనర్, సభ్యులు

వీధి కుక్కల జనన నియంత్రణకు ముగ్గురు వైద్యులు

● రూ.51 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

● మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వీధి కుక్కల జనన నియంత్రణకు ప్రత్యేకంగా ముగ్గురు వైద్యులను, నలుగురు సహాయకులను, డాగ్ క్యాచర్లను తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకోవడానికి, నగరంలో సుమారు రూ.51 కోట్లతో పలు డివిజన్లలో అభివృద్ధి పనులను నిర్వహించేందుకు స్థాయి సంఘం ఆమోదం తెలిపిందని అధ్యక్షుడు, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మేయర్ ఛాంబర్‌లో మంగళవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నగరపాలక సంస్థ స్థాయి సంఘ సమావేశం నిర్వహించి పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. నగరంలోని ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు, నగర పాలక సంస్థ అధికారులు ప్రతిపాదించిన 143 అంశాలకు సంబంధించిన అభివృద్ధి పనులను స్థాయి సంఘ సభ్యులు, నగర పాలక సంస్థ వివిధ విభాగాధిపతులతో విపులంగా చర్చించి ఆమోదం తెలిపారు. మేయర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను నగరంలోని శివారు ప్రాంతాలలో, నగర పాలక సంస్థలో విలీనమైన గ్రామాలలో స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలతో రోడ్లు, డ్రెయిన్లు, వీధి దీపాలు, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు వంటి పలు అభివృద్ధి పనులు చేయుటకు ఆమోదం తెలిపామన్నారు. నాజ్ సెంటర్‌లోని షాపింగ్ కాంప్లెక్స్, స్వామి థియేటర్ వద్ద గల షాపింగ్ కాంప్లెక్స్, అడవితక్కెళ్ళపాడులోని షాపింగ్ కాంప్లెక్స్‌లలో లీజు గడువు పూర్తైన షాపులకు నిబంధనల ప్రకారం రెన్యువల్‌ను ఆమోదించడమైనదన్నారు. సమావేశంలో స్థాయి సంఘ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, కొమ్మినేని కోటేశ్వర రావు, నూకవరపు బాలాజీ, దాసరి లక్ష్మీ దుర్గ, ముప్పవరపు భారతి, నగర పాలక సంస్థ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం పాల్గొన్నారు.

గ్రీన్ గుంటూరు లక్ష్యంగా ఐదు లక్షల మొక్కలు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రీన్ గుంటూరు లక్ష్యంగా నగరంలో 5 లక్షలు మొక్కలు నాటడానికి వార్డు సచివాలయాల వారీగా ప్రజలను భాగస్వాములను చేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 5వ తేదీన అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణం, ప్లాస్టిక్ నిషేధంపై రూపొందించిన పోస్టర్ ఆవిష్కరణ కమిషనర్ చాంబర్లో జరిగింది. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవం స్ఫూర్తితో నగరంలో ఆ రోజు 25 వేలు నాటేలా, ఈ కాలంలో 5 లక్షల మొక్కలు నాటేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే నగరంలో ప్లాస్టిక్ సంచుల నిషేధంలో భాగంగా ప్రజలకు ప్రత్యామ్నాయంగా రూ.5లకే గుడ్డ సంచులను ఇచ్చే మెషిన్లను కూడా 5 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఉపా సెల్ పిఓ రామారావు, ఐటీసీ నారాయణ, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సులపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి : కమిషనర్

నగరపాలక సంస్థ పరిధిలో వార్డ్ సచివాలయాల వారీగా డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను, కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ అమరావతి రోడ్, నగరాలు, పాత గుంటూరు, బాలాజీ నగర్, ఐపిడి కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి, ట్రేడ్ లైసెన్స్‌లు, పారిశుధ్య పనులు, పూడికతీత పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వ్యాపార, వాణిజ్య సంస్థ తప్పనిసరిగా నగరపాలక సంస్థ నుండి డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్‌లు రాంబాబు, సోమశేఖర్, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే అమరావతి రోడ్ లోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి, టిఫిన్ చేసి, ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

నేడు ఎన్టీఆర్ స్టేడియం ఎదుట మెగా యోగా

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025లో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోని స్థానిక ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియం ఎదురు రోడ్డులో బుధవారం ఉదయం 6 గంటలకు జిల్లా మెగా యోగా కార్యక్రమం జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు, యోగా శిక్షకులు, అభ్యాసకులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తాం

నగరంలోని కొరిటపాడు వాకింగ్ ట్రాక్‌ను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ సభ్యత్వాన్ని నగర మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే గల్లా మాధవిలకు వాకింగ్ ట్రాక్ అధ్యక్షుడు కన్నసాని బాజీ, కార్యదర్శి బెజవాడ గోపాలకృష్ణారెడ్డి మంగళవారం అందజేశారు. మేయర్, ఎమ్మెల్యేలు జరుగుతున్న కోటి రూపాయల అభివృద్ధి పనులు గురించి తెలుసుకొని ప్రజల అవసరాల కోసం ఉండే వాటిని ఇంకా తీర్చిదిద్దాలని సూచించారు.

ఒలింపియాడ్‌లో సీతారామయ్య హైస్కూల్ విద్యార్థి ప్రతిభ

గుంటూరు కార్పొరేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యూనిఫైడ్ కౌన్సిల్ వారు ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి సైన్స్ ఒలింపియాడ్‌లో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య (సిబిఎస్ఈ) పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న చదలవాడ శ్రీయాన్ కార్తికేయ తన ప్రతిభ చూపి ఆంధ్రప్రదేశ్ జోన్‌లో మొదటి స్థానం సాధించినట్లు పాఠశాల కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతి దేవి, సీనియర్ కో ఆర్డినేటర్ దోసకాయల దుర్గా శ్యామ్ పాల్గొన్నారు.

పేదల పాలిట సంజీవని ముఖ్యమంత్రి సహాయనిధి

● పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పేదవారి ఆరోగ్యాన్ని నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) సంజీవని లాగా పని చేస్తోందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ విధానాన్ని అందించేందుకు కృషి చేస్తానని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఆమె ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటిని వెంటనే పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం 55 మంది లబ్ధిదారులకు రూ.70,71,253 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదవారి సంక్షేమం, ఆరోగ్యం గురించి నిరంతరం పరితపిస్తున్నారని, అన్నివేళలా పేదవారికి అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

కవల చిన్నారుల చిరునవ్వులే ప్రభుత్వానికి ఆశీర్వాదం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ సాయం అందుకున్న కవల చిన్నారుల చిరునవ్వులే కూటమి ప్రభుత్వానికి ఆశీర్వాదం అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరులోని సుద్దపల్లి డొంక ఆల్లీనగర్‌కు చెందిన పఠాన్ సలీం, కరిష్మా దంపతులకు ఏడో నెలలోనే జన్మించిన కవలలకు వైద్య సహాయం కింద సీఎంఆర్ఎఫ్‌ను మంగళవారం ఆయన అందించారు. ఏడోనెలలోనే జన్మించి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న చిన్నారుల వైద్యానికి రూ.7 లక్షలు ఖర్చుకాగా, సీఎంఆర్ఎఫ్ కింద రూ.2.57 లక్షలు అందజేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.2 కోట్లకుపైగా సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయించామని తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని బసవ శంకరరావు కుటుంబానికి రూ.31 వేలు, టీ.సోమ సుందరరావు కుటుంబానికి రూ.26 వేలు చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్స్ ఎల్లావుల అశోక్, రియాజ్, జమీర్, కందుకూరి వెంకట్, ప్రభాకర్, ఫరూక్, వంగర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో భైరవం సినిమా యూనిట్ సందడి



విజయును సత్కరిస్తున్న ఎమ్మెల్యే నసీర్, పాల్గొన్న హీరోలు రోహిత్, మనోజ్

గుంటూరు (తూర్పు) జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో భైరవం సినిమా యూనిట్ సందడి చేసింది. స్థానిక కొత్తపేట, భాస్కర్ థియేటర్‌కి ఆ సినిమా హీరోలు నారా రోహిత్, మంచు మనోజ్ కుమార్, దర్శకుడు కనకమేడల విజయ్ వచ్చి ప్రేక్షకులను పలకరించారు. సినిమా బాగుందా అంటూ అభిమానులను ఉత్సాహపరిచారు. మంచి విజయాన్ని ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. ప్రేక్షకుల అభిరుచి కనుగుణంగా కథలను ఎంపిక చేసుకొని మంచి పాత్రలను పోషిస్తామని హీరోలు చెప్పారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ చాలా రోజుల తర్వాత మల్టీ స్టార్ సినిమా రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం హీరోలను, దర్శకుడిని ఎమ్మెల్యే నసీర్, భాస్కర్ థియేటర్ యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంపిణీదారులు, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

బాలికపై అనుచిత ప్రవర్తన..కేసు నమోదు

గుంటూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని 8 ఏళ్ల బాలిక పట్ల ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక తల్లిదండ్రుల మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. ఈ క్రమంలో పిల్లలతో కలిసి తల్లి ఆటో డ్రైవర్ మస్తాన్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఏప్రిల్‌లో బాలిక పట్ల మస్తాన్ అనుచితంగా ప్రవర్తించాడు. ఇటీవల బాలిక నిద్రలో నుంచి ఉలిక్కిపడి లేవడంతో తల్లి విచారించగా బాలిక అసలు విషయం చెప్పింది. దీంతో మంగళవారం తల్లి ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లాడ్జిలో గుర్తు తెలియని యువకుడి మృతి

గుంటూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నాజ్ సెంటర్ నుండి రైల్వేస్టేషన్ దారిలో ఉన్న శివ బాల మడత మంచాల లాడ్జిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రాజు(35) అనే వ్యక్తి గదిలో మృతిచెంది ఉండగా లాడ్జి ఓనర్ కొత్తపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆచూకీ కోసం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి శవాగారంలో భద్రపరచినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు కొత్తపేట సీఐ నంబరు 86888 31320, పోలీస్ స్టేషన్ నంబరు 0863 2221815 సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

భార్యపై హత్యాయత్నం.. నిందితుడి అరెస్టు

గుంటూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కొరిటెపాడులో గత నెల 25న భార్యను కత్తితో పొడిచి హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. చిలకలూరిపేటకు చెందిన మెరిగల రాజేష్ కుమార్, మాలతికి భార్యభర్తలు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. పెయింటర్ రాజేష్ మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తలు మనస్పర్థలు వచ్చి విడిపోయారు. అయితే కొడుకుని తనతో పంపాలంటూ కొంతకాలంగా కోబాల్ట్ పేటలో ఉండే అత్తింటికి వెళ్లి భార్యపై రాజేష్ గొడవ చేస్తూ వచ్చాడు. ఇందుకు భార్య మాలతి అంగీకరించలేదు. ఈ క్రమంలో కొరిటెపాడులోని ఓ న్యూట్రిషన్ సెంటర్‌లో పనిచేస్తున్న మాలతిని రాజేష్ కత్తితో పొడిచాడు. సోమవారం అతడిని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

మహిళా ఎస్ఐ కొడుకుపై చీటింగ్ కేసు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఓ యువకుడి నుంచి రూ.6లక్షలు తీసుకొని మోసం చేసిన మహిళా ఎస్సై కొడుకుపై పట్టాభిపురం పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. అశోక్ నగర్ నాలుగవ లైనుకు చెందిన రవికాంత్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని నగరాలులో ఉంటున్న మహిళా ఎస్సై కుమారుడు మనోజ్ కుమార్ నగదు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో డబ్బులు తిరిగివ్వాలని మనోజ్ కుమార్‌ని కొంత కొంతకాలంగా అడుగుతూ వచ్చాడు. తన డబ్బు తిరిగి ఇవ్వపోవడంతో రవికాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జగన్‌ను సైకో కింగ్ అనడంలో తప్పులేదు

● పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి



గుంటూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో గంజాయి విక్రయాలు, సామాన్యులపై దాడులు, మహిళలపై వేధింపులు, హింసాత్మక ఘటనలకు పాల్పడిన నేరస్థులను పరామర్శించడానికి వచ్చిన జగన్‌రెడ్డిని సైకో కింగ్ అనటంలో తప్పు లేదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. జగన్ రెడ్డి తెనాలి పర్యటనను ఖండిస్తూ మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. మనీలాండరింగ్, క్విడ్ ప్రోకో కేసులు, క్రిమినల్ కేసులు ఉన్న జగన్ రెడ్డి తెనాలిలో రౌడీషీటర్లను పరామర్శించడంలో వింతేమీ లేదని, గంజాయి బ్యాచ్‌కు డాన్ లాగా జగన్ రెడ్డి మారిపోయారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత యువకులపై దాడి అంటూ నేరస్థులకు కూడా కులాలు ఆపాదించి లబ్ధి పొందాలని చూస్తున్న జగన్ రెడ్డి ఎంతలా దిగజారిపోయారో చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. వైసీపీ హయాంలో దళిత డాక్టర్ సుధాకర్‌ను ఎలా హింసించి చంపారో, దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేశారో, అంబేద్కర్ విదేశీ విద్య, ఎస్సీ కార్పొరేషన్‌ను ఎలా నిర్వీర్యం చేసారో ప్రజలు ఎవరు మర్చిపోలేదన్నారు.

రాష్ట్రానికి జగనే చేటు

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ ధ్వజం



గుంటూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దొంగలకు, దోపిడీదారులకు మద్దతు పలికే జగన్ లాంటి నాయకులతోనే రాష్ట్రానికి చేటు అని తూర్పు ఎమ్మెల్యే నసీర్ విమర్శించారు. వైసీపీ నిర్వహించనున్న వెన్నుపోటు దినోత్సవంపై మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 151 సీట్లతో అధికారాన్ని అప్పగిస్తే ఐదేళ్లపాటు దోపిడీలు, ప్రజా కంటక పాలనతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని జగన్‌పై మండిపడ్డారు. జగన్ చేసిన ద్రోహలన్నీ ఒక్కొక్కటి బయటకు రావడంతో భయపడి ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారని దుయ్యబట్టారు. జగన్ అధికారం చేపట్టిన వెంటనే అన్ని వర్గాలకు అన్యాయం చేశారని, ప్రధానంగా పేదోళ్లకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లు మూసేశారని గుర్తు చేశారు. మైనారిటీల హక్కులకు భంగం కలిగించారని, రంజాన్ తోఫా వంటి వాటిని తీసేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కొక్కరిపై 10 చొప్పున కేసులు ఉన్న రౌడీలకు మద్దతు తెలిపేందుకు తెనాలి పర్యటనకు వచ్చిన జగన్ ప్రజలకు ఏ ముఖం చూపిస్తారని నిలదీశారు.

వెన్నుపోటు.. గొడ్డలివేటు పేటెంట్ జగన్ రెడ్డిదే

● దేగల ప్రభాకర్



గుంటూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జగన్ రెడ్డి చేసిన కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే వెన్నుపోటు ధర్నాల డ్రామా ఆడుతున్నారని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దేగల ప్రభాకర్ ఆరోపించారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అధికారంలో ఉన్న తొలి ఏడాదిలో 10శాతం హామీలను కూడా అమలు చేయని వ్యక్తి జగన్‌రెడ్డి అని అన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలను అమలు చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమే అని అన్నారు. కాంగ్రెస్‌ని అడ్డంపెట్టుకొని రూ.లక్షల కోట్లు దోచుకొని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీని స్థాపించాడని అన్నారు. ఎత్తుకొని పెంచిన బాబాయ్‌ని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకుల్ని కాపాడుతూ, రక్త సంబంధానికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి జగన్‌రెడ్డి అని అన్నారు. ఆస్తి కోసం తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి, కుటుంబ వ్యవస్థకే జగన్ రెడ్డి వెన్నుపోటు పొడిచాడన్నారు.

● నాణ్యత, రుచిలో తగ్గేదే లేదు
● తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాలకు ఎగుమతి

ఆవకాయకు కేరాఫ్ పెదపులివర్రు

● జీవనోపాధిగా మొదలై..ఎంతో మందికి నేడు ఉపాధి
● రాణిస్తున్న మల్లిపెద్ది విజయలక్ష్మి


సిద్ధం చేసిన ఆవకాయ పచ్చడి


మామిడికాయలను ముక్కలుగా కోస్తున్న మహిళలు

రేపల్లె, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆవకాయ పచ్చడి లేని తెలుగువారి ఇల్లు ఉండదు. ఆవకా య లేకుండా భోజనం పూర్తి చేయని వారు ఉండరు. వేసవి వచ్చిందంటే ఊరగాయలు, ముఖ్యంగా ఆవకాయ ప్రతి వం టింటిలో ఉండాల్సిందే. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రు గ్రామం ఓ మారుమూల ఉన్నప్పటికీ.. ఊరగాయ పచ్చళ్లకు పెట్టింది పేరు. తెలుగు రాష్ట్రాల్లో ఏదో ఒక మూల ఊరగాయల ప్రస్థావన వస్తే.. అందులో ముందుగా వినిపించే పేరు..పెదపులివర్రు. ఈ ఊరిలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది మల్లిపెద్ది విజయలక్ష్మి. తొలి రోజుల్లో చిన్నపాటి ఊరగాయ పచ్చళ్ల తయారీతో.. కుటుంబానికి తోడ్పాటునందించిన విజయలక్ష్మి నేడు పది కుటుంబాలకు పైగా ఉపాధిని కల్పిస్తూ.. పచ్చళ్ల వ్యాపారంలో రాణిస్తున్నారు.. జిల్లా ఖాదీ గ్రామీణ ఉద్యోగ సంస్థ 18 ఏళ్ల క్రితం అందించిన ఆర్థిక సాయమే.. తన ఈ స్థితికి కారణమని విజయలక్ష్మి అంటారు. ఆనాడు సంస్థ ఆర్థిక సాయంతో.. పచ్చళ్లు తయారు చేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు, చుట్టుపక్కల గ్రామాల గృహస్తులకు ఊరగాయలను ఆమె విక్రయిస్తూ ఉండేవారు. ఈ నేపథ్యంలోనే అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు మహిళలు, స్వయం సహాయక సంఘాలు, కుటీర పరిశ్రమలు తయారు చేసిన వివిధ రకాల వస్తువులు, తినుబండారాల ఎగ్జిబిషన్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయించారు. అందులో విజయలక్ష్మి పచ్చళ్ల స్టాల్ కూడా ఉంది. అక్కడకు వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు పచ్చళ్ల రుచి చూసి ఎంతో మధురంగా ఉన్నాయని అభినందించారు. దీంతో పాటు హైదరాబాద్ ఎర్రగడ్డ రైతు బజార్‌లో పచ్చళ్ల విక్రయాలకు ఒక స్టాల్‌ను కేటాయించారు. అప్పటి నుండి విజయలక్ష్మి పచ్చళ్ల వ్యాపారం అభివృద్ధి చెందుతూ వస్తోంది. నాటి నుండి ఈనాటి వరకు కూడా అదే క్వాలిటీ మెయింటేన్ చేస్తూ వస్తున్నారు. అన్ని పదార్థాలు సమపాళ్లలో.. సాంప్రదాయ పద్ధతిలో ఆవకాయ తయారు చేయడం జరుగుతుందని విజయలక్ష్మి చెబుతారు. ప్రతి పదార్థం నాణ్యమైనదే వినియోగించడం ద్వారా ఎక్కువ కాలం పచ్చళ్లు నిల్వ ఉండి, తాజాగా ఉంటాయని అంటున్నారు. ఆవకాయ, మాగాయి, చింతకాయ, గోంగూర, టమోటా, పండుమిర్చి, అల్లం, ఉసిరి పచ్చళ్లతో పాటు వివిధ రకాల కారం పొడులు తయారు తయారు చేస్తుంటారు. వీటిని తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, విదేశాలకు ఎగుమతులు చేస్తున్నట్లు విజయలక్ష్మి తెలిపారు.


మామిడికాయ ముక్కలలో కారం, ఉప్పు కలుపుతున్న మల్లిపెద్ది విజయలక్ష్మి


మాగాయపచ్చడికి సిద్ధం చేసిన మామిడిముక్కలు

వాస్తవాలు.. వక్రీకరణ

(5వ పేజీ తరువాయి)

చేసుకున్నట్లు సదరు విషయాన్ని నిందితుడు ఒప్పుకోలు నామాలో కూడా ధ్రువీకరించాడు. కానీ ఇందుకు విర్ధుంగా జగన్ తన ప్రసంగంలో చెప్పారు. అమాయకపు యువకులపై కానిస్టేబుల్ కేసు తర్వాతే రౌడీషీట్ తెరిచారని, వారిపై కక్ష సాధింపుతోనే ఈ చర్యకు పోలీసులు పాల్పడ్డారనేది జగన్ మరో ఆరోపణ. ఐతే వీరిపై 2017 నుంచి 2024 మధ్య పలు స్టేషన్ల పరిధిలో కేసులు నమోదైతే, దోమా రాకేష్‌పై 4 కేసులు, విక్టర్‌పై ఐదు కేసులు వైసీపీ ప్రభుత్వ హయాంలోనే నమోదయ్యాయి. జాన్ విక్టర్‌పై2023 జూలైలోనే రౌడీ షీట్ ఓపెన్ చేశారు. పరారీలో ఉన్న నవీన్‌పై అదే సంవత్సరం జూలైలోనే ఓపెన్ చేశారు. దోమా రాకేష్‌పై మాత్రం ఇన్ని కేసుల్లో ప్రమేయం ఉండటం, అతడిపై గతంలో రౌడీ షీట్ లేదని తెలియటంతో నేర ప్రవృత్తి ఆధారంగా కానిస్టేబుల్‌పై దాడిచేసిన సంఘటన తర్వాత రౌడీషీట్ ఓపెన్ చేశారు. ఒక్క కరిముల్లాపై మాత్రం గతంలో ఏ కేసులూ లేవు. వైసీపీ ప్రభుత్వ కాలంలోనే గంజాయి కేసులు నమోదయ్యాయంటే వీరి నేరం వెనుక అసలు పాత్ర ఎవరిదనేది వీటిని పరిశీలిస్తే అర్థమవుతుంది.

వైసీపీ హయాంలోనే నేరాలు.. షీట్లు..

పోలీసులు ఐతానగర్ సెంటర్‌లో లాఠీ కౌన్సెలింగ్ ఇచ్చాకే వీరందరిపై రౌడీషీట్‌లు తెరిచారని చెప్పారు. కానీ నిందితుల్లో ఒకరైన చేబ్రోలు జాన్ విక్టర్‌పై వైసీపీ హయాంలోనే 2023 జూలై 9న తొలుత సస్పెక్టడ్ షీట్ తెరిచారు. 2017లో నేరచరిత్ర మొదలుకాగా 2019-2024లో మరింతగా రెచ్చిపోయాడు. గత జనవరిలో సస్పెక్టడ్ షీట్‌ను రౌడీషీట్‌గా మార్చారు. అలాగే మరో రౌడీషీటర్ దోమా రాకేష్‌పై 2019-2024 మధ్య వైసీపీ ప్రభుత్వ హయంలోనే 5 కేసులు నమోదయ్యాయి. హత్యాయత్నం, దారిదోపిడీలు, దొంగతనాలు తదితర 9 కేసుల్లో రాకేష్ నిందితుడు. అలాగే రౌడీషీటర్లు వేమా నవీన్ అలియాస్ కిల్లర్, చేబ్రోలు జాన్ విక్టర్లపై ఒక్కొక్కరి మీద హత్యాయత్నం, దారిదోపిడీలు, దొంగతనాలు, గంజాయి తదితర 10 కేసులు ఉన్నాయి. వైసీపీ హయాంలో నవీన్‌పై 6 కేసులు, జాన్ విక్టర్‌పై మూడు కేసులు ఉన్నాయి.

వైసీపీ హయాంలో తెనాలిలో అరాచకం

ప్రశాంత వాతావరణానికి నెలవైన తెనాలిలో వైసీపీ హయాంలో అరాచకం రాజ్యమేలింది. శాంతిభద్రతలు ప్రశ్నార్థకంగా మారాయి. భయం గుప్పిట సామాన్యులు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. నాడు అధికార పార్టీ ప్రజాప్రతినిధి అండతో అటు రౌడీషీటర్లు, ఇటు పోలీసులు రెచ్చిపోయారు. రౌడీషీటర్లను వైసీపీ నాయకులు పెంచి పోషించారన్నందుకు ఎన్నో నిదర్శనాలు వెలుగుచూశాయి. గతంలో ఐతానగర్ కేంద్రంగా రౌడీషీటర్ సురేంద్రగ్యాంగ్ సాగించిన అరాచకం తెనాలివాసులను భయాందోళనకు గురిచేసింది. భేదాభిప్రాయాలతో సురేంద్రను కొంతకాలం దూరం పెట్టగా అతడి అనుచరుడైన సముద్రాల పవన్‌కుమార్ అలియాస్ లడ్డును ఆ నేత ప్రోత్సహించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో రౌడీషీటర్ పవన్‌కుమార్ ఆగడాలు శృతిమించాయి. ఇటీవల పట్టపగలు ఐతానగర్‌లో నడిరోడ్డుపై పవన్ కుమార్, అతడి అనుచరుడు సాగించిన బీభత్సకాండకు స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కొండుతుండగా అటుగా వెళుతున్న సాఫ్ట్వేర్ ఇంజనీర్ ఈదర కార్తీక్ సర్ది చెప్పేందుకు ప్రయత్నించగా విచక్షణా రహితంగా దాడి చేసి కొట్టిన సీసీకెమెరాలోని దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా వాటిని చూసిన తెనాలివాసులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఐతానగర్ పరిధిలోని లంకదిబ్బలో స్వల్ప వివాదంలో మేరీ అనే మహిళకు చెందిన పాలబూత్‌కు నిప్పు పెట్టి దహనం చేశారు. ఇలా రౌడీషీటర్ లడ్డు రెచ్చిపోతుండటంతో అతడ్ని తెనాలి నుంచి బహిష్కరించేందుకు పోలీసు ఉన్నతాధికారులు ఫైల్‌ను సిద్ధం చేశారు. అయితే ఈ విషయం తెలుసుకున్న అప్పటి వైసీపీ నేత ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి ఫైలుకు మోకాలొడ్డినట్లు ఆరోపణలు వచ్చాయి.

వీసీకి.. రిజిస్ట్రార్ క్లీన్‌చిట్

వీసీపై ఆరోపణలు.. రిజిస్ట్రార్ విచారణ

ఎన్జీ రంగా వర్సిటీలో వెలుగు చూస్తోన్న విచిత్రాలు


ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

గుంటూరు సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్(వీసీ) పెద్ద. ఆరోపణల వచ్చిన నేపథ్యంలో అటువంటి వారిపై విచారణ జరపాలంటే అంతకంటే పెద్దస్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించాలి. అయితే ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీలో మాత్రం అలా జరగలేదు. వీసీపై ఆరోపణలు వస్తే ఆయనకంటే దిగువస్థాయి అధికారితో విచారణ జరిపించి క్లీన్‌చిట్ ఇప్పించిన వైనం తాజాగా వెలుగుచూసింది. విచారణను తూతూ మంత్రంగా ముగించిన వ్యవహారంపై వర్సిటీలోని అధికారులే పెదవి విరుస్తున్నారు. వీసీ అదుపు ఆజ్ఞలో ఉండే రిజిస్ట్రార్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ వ్యవసాయ శాఖ ఉన్నత అధికారులు తీసుకున్న నిర్ణయంపై జోకులు వేసుకుంటున్నారు. ఒకప్పుడు హరిత విప్లవానికి బాటలు వేసి.. నూతన పరిశోధనలతో వ్యవసాయ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించిన గుంటూరు లాంఫాంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైసీపీ హయాంలో గాడితప్పింది. అవినీతి, అక్రమాలకు ఆనవాలుగా మారింది. దానిపై జనవరి 24న 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో 'రంగా వర్సిటీకి అవినీతి రంగు 'అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించిన వ్యవసాయ మంత్రి కార్యాలయం విచారణకు ఆదేశించింది. దీంతో విచారణకు ఐఏఎస్ అధికా రిని నియమిస్తారని అందరూ భావించారు. కానీ వీసీపై వచ్చిన ఆరోపణలు నిజమో.. కాదో తేల్చాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ను వ్యవసాయశాఖాధి కారులు ఆదేశించారు. అయితే గతంలో చేపట్టిన విచారణ బృందం సుమారు 30 మందికి ఉద్యోగోన్నతలు, కొత్తగా ఉద్యోగాలు ఇచ్చే పేరుతో నగదు వసూళ్లు, వర్సిటీ ఖాతా ల నిర్వహణ, మత ప్రచారం వంటి అంశాలన్నీ నిజమే అని తేల్చింది. అయితే వర్సిటీ రిజిస్ట్రార్ ఇచ్చిన నివేదిక లో మాత్రం అన్నీ సక్రమంగానే జరిగినట్లు వీసికి క్లీన్‌చిట్ ఇస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు సమాచారం.



ద్విచక్ర వాహనాల నంబర్ ప్లేట్లపై రాసిన రాతలు

ప్లేట్ ఫిరాయిస్తున్నారు..!

● కనిపించని హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు
● అస్పష్టంగా వాహన ప్లేట్లపై నంబర్లు
● నేతలు, హీరోల చిత్రాలతో హడావిడి
● పట్టించుకోని రవాణా అధికారులు

గుంటూరు(తూర్పు), జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కొంత మంది వాహనదారులు ట్రెండ్ సెట్ చేస్తున్నామనుకుంటూనే ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటున్నారు. కార్లు, బైక్‌లకు నంబరు ప్లేట్లు లేకుండా ఇష్టానుసారంగా రోడ్లపై తిరుగుతున్నారు. మైనర్లు సైతం అధిక సీసీ ఉన్న బైక్‌లపై స్నేక్ రేస్ అంటూ వేగంగా దూసుకెళుతున్నారు. అనుకోని ప్రమాదం జరిగితే నష్టం ఊహకు అందడం లేదు. బైక్‌లపై ఫీట్లు ఇతర ప్రమాదాలు జరిగినప్పుడు వారిని గుర్తించేందుకు వెహికల్ నంబరు ప్లేట్లు స్పష్టంగా ఉండాలి. ఆ బైక్‌ల నంబర్లను గుర్తించేందుకు వీలులేకుండా రకరకాల పేర్లతో ప్లేట్లపై ఇష్టారాజ్యంగా రాసేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను గుర్తించే సమయంలో నంబర్ ప్లేట్ కీలకం. ప్రమాదాల బారిన పడినప్పుడు అస్పష్టంగా, నంబరు లేని ప్లేట్లతో.. బాధితులను గుర్తించడం అధికారులకు తలనొప్పిగా మారుతుంది.

● ఇష్టారాజ్యంగా వాహనాల నంబరు ప్లేట్లపై రాతలు

షోరూంల్లో వాహనాలను కొన్నవారు తప్పనిసరిగా 2017 నుంచి ప్రభుత్వం అందించే హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలనే నిబంధన అమలులోకి వచ్చింది. కానీ, నంబరు ప్లేట్లు, నంబరు లేని లేదా చిన్నగా, గజిబిజిగా అస్పష్టంగా ఉన్న నంబర్లతో వాహనదారులు రోడ్లపై దూసుకుపోతున్నారు. కొందరు వాహనదారులు ఏకంగా సినీ హీరోలు, రాజకీయ నాయకుల ఫొటోలు ఇతరత్రా చిత్రాలతో తిరుగుతున్నారు. ఇంకొంత మంది అయితే.. ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం తాలూకా, వారి కంపెనీల పేరు అంటూ నంబరు బదులు రాసుకుంటూ.. మనల్ని ఎవడ్రా ఆపేదీ.. అంటూ అధికా రులకే సవాల్ విసురుతున్నారు. అయినా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారు.

హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు తప్పనిసరి

సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్ ప్రకారం వాహనాలపై రిజిస్ట్రేషన్ మార్కు ప్రదర్శించేలా అన్ని మోటారు వాహనాల ముందు, వెనుక భాగాల్లో హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్‌ఎస్‌ఆర్పీ) రూపంలో స్పష్టంగా ఉండాలి. అవసరమైన చోట వాహనం ఎడమ చేతి వైపు ముందు గ్లాసుపై క్రోమియం ఆధారిత హోలోగ్రామ్ స్టిక్కర్ ఉండాలి. ప్రతి నంబరుకు మరో నంబరు మధ్య చిన్నపాటి గ్యాప్ ఉండాలి. తెలుపు రంగులో ప్లేటుపై నల్లని అక్షరాలు మాత్రమే ఉండాలి. కాకపోతే కొంతమంది వాహన యజమానులు ఈహెచ్‌ఎఆర్పీని వాహనానికి అమర్చడం లేదని డీలర్లు చెబుతుంటారు.

● ప్రత్యేక డ్రైవ్



వాహనాల నంబరు ప్లేట్లపై దృష్టి సారించాం. ప్రత్యేక డ్రైవ్ ద్వారా నిబంధనలు పాటించని ప్లేట్లను అక్కడికక్కడే తొలగిస్తాం. నంబరు ప్లేటుపై.. ఇష్టానుసారం పిచ్చి రాతలు రాస్తే రూ.2 వేలు వరకు జరిమానా విధిస్తాం. అవసరమైతే వాహనాన్ని కూడా జప్తు చేస్తాం.

-ఆర్టీవో, సత్యనారాయణ వరప్రసాద్, గుంటూరు



ఆధార్ నవీకరణకు అగచాట్లు!

(5వ పేజీ తరువాయి)

మూసి వేశారు. వేలాది మంది చిన్నారుల ఆధార్ నవీకరించాల్సి ఉంది.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలు అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ తరుణంలో ఆధార్ నవీకరణ లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తోంది. వేలిముద్రలు, చిరునామా, వ్యక్తిగత చిత్రం, మొబైల్ నంబరు, ఇతర దోషాల సవరణకు ప్రైవేట్ ఆధార్ కేంద్రాల వద్ద తీవ్ర ఇక్కట్లు ప డుతున్నారు. కొత్తగా పెళ్లి అయినవారు కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్‌లో చిరునామా మార్చుకొవాలి.

పిల్లల ఆధార్ నవీకరణ తప్పనిసరి..

పిల్లలకు ఆధార్ నవీకరణ తప్పనిసరి. ఆధార్ తీసుకున్న 15 ఏళ్లలోపు వారి వేలి ముద్రలను నవీకరించుకోవాలి. 16 నుంచి 18 ఏళ్ల మధ్యలో వేలి ముద్రలు, కనుపాపల పునర్స్వీరణ తప్పనిసరి. ఇలా చేసుకుంటేనే విద్యార్థులకు వివిధ పరీక్షలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. తగిన ధ్రువ పత్రాలను అప్‌లోడ్ చేస్తేనే నవీకరణ ప్రక్రియ సజావుగా సాగుతుంది. గతంలో సబంధిత పత్రాల నమోదు కాకపోవడం ఇతర సాంకేతిక కారణాలతో చాలా వరకు తిరస్కరణకు గురయ్యాయి.

నవీకరణకు అధిక వసూళ్లు..

గతంలో ఆధార్ నవీకరణ కోసం ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను నిర్వహించింది. ఇటువంటి పరిస్థితి ప్రస్తుతం లేదు. దీంతో ఆధార్‌లో మార్పులు చేసేందుకు కొన్ని ప్రైవేటు కేంద్రాల్లో రూ.500 నుంచి రూ.700 వరకు వసూలు చేస్తున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. వీటిపై అధికారులు పర్యవేక్షణలేదు. ఇప్పటికైనా అధికారులు ఆధార్ నవీకరణ కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని బాధితులు కోరుతున్నారు. నవీకరణ కాకపోతే పథకాలను కోల్పోతామన్న ఆందోళన సర్వాత్రా నెలకొంది.

వైకుంఠపురంలో అక్రమ క్వారీయింగ్

వెంకన్నకొండ దిగువున గ్రావెల్ తవ్వకం... తరలింపు

అమరావతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వైకుంఠపురంలో సోమవారం రాత్రి గ్రావెల్ అక్రమ క్వారీయింగ్ చేశారు. వెంకన్న కొం డ దిగువన, ఉత్తరవాహిని తీర్థానికి వెళ్లే మార్గంలో గ్రావెల్ తవ్వి తరలించిన ఆనవాళ్లు మంగళవారం వెలుగుచూశాయి. గతంలో కూడా కొండకు ఉత్తరం వైపున ఇసుక ర్యాంప్ నిర్వాహకులు అక్రమంగా గ్రావెల్ క్వారీయింగ్ చేసి రోడ్లకు వినియోగించారు. గ్రామానికి చెందిన వారే తాజాగా కూడా క్వారీయింగ్‌కు పాల్పడినట్లు స్థానికులు తెలుపుతున్నారు. అక్రమ తవ్వకాల సమాచారంతో తహసీల్దారు ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది వెళ్లగా అప్పటికే అక్రమార్కులు క్వారీయింగ్ నిలిపేసి వెళ్లిపోయారని సమాచారం. గత ప్రభుత్వంలో కన్నా ప్రస్తుతం కృష్ణానదిలో, చెరువులలో, కొండ ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమ క్వారీయింగ్ జరుగు తుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే అక్రమాలకు పాల్పడుతున్న అధికార పార్టీ నాయ కుల జోలికి వెళ్లేందుకు అధికారులు సాహ సించడంలేదని సమాచారం.

❖ ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల- పల్నాడు జిల్లా మాదిపాడు మధ్య నిర్మాణం
❖ రూ.60.54 కోట్ల వ్యయంతో నెల రోజుల కిందట పనులు ప్రారంభం
❖ 13 పిల్లర్లతో 14.8 మీటర్ల వెడల్పుతో నిర్మాణం కానున్న బ్రిడ్జి

కృష్ణానదిపై.. బ్రిడ్జి!

(ఆంధ్రజ్యోతి, జగ్గయ్యపేట రూరల్): పవిత్ర కృష్ణానది ఉత్తర వాహిని క్షేత్రం ముక్త్యాల నుంచి కృష్ణానదిపై పల్నాడు జిల్లా మాదిపాడు వరకు కృష్ణాబ్రిడ్జి నిర్మాణ పనులు నెల రోజుల కిందట ప్రారంభమయ్యాయి. రూ.60.54 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ వంతెనతో ముక్త్యాల ముఖచిత్రం మారనుంది. ఈ బ్రిడ్జి భవిష్యత్తులో పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా ముక్త్యాలకు మణిహారం కానుంది. పల్నాడు జిల్లా వైపు ఇప్పటికే రెండు పిల్లర్ల నిర్మాణం జరుగుతుండగా మూడవ పిల్లర్‌కు బేస్‌మెంట్ సిద్ధం చేస్తున్నారు. మొత్తం 13 పిల్లర్లతో 14.8 మీటర్ల వెడల్పుతో బ్రిడ్జి నిర్మిస్తున్నారు. పల్నాడు జిల్లాలో 6.5 మీటర్లు, ఎన్టీఆర్ జిల్లాలో రెండు కిలోమీటర్ల మేర అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసే అప్రోచ్ రోడ్డును జగ్గయ్యపేట-ముక్త్యాల రోడ్డుకు అనుసంధానం చేస్తున్నారు. 18 నెలల్లో పూర్తి చేసేందుకు కాంట్రాక్టు సంస్థ అన్ని హంగులతో రంగంలోకి దిగింది. వర్షాకాలం ముందుగా రావటం వల్ల పనులకు ప్రతిబంధకం కావచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం నదిలో 15 మీటర్ల లోతులో నీరు ఉందని అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లా వైపు పూర్తైతే ఎగువ నుంచి వచ్చే నీరు ఆ వైపునకు మళ్లించి పిల్లర్‌లు నిర్మించాల్సి ఉంది.

దశాబ్దాల క్రితమే ప్రతిపాదన

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల మధ్య దశాబ్దాల క్రితం వంతెన నిర్మించాలని ముక్త్యాల రాజా ప్రసాద్ ప్రతిపాదనలు పంపినా కార్యరూపం దాల్చలేదు. నది వెడల్పు ఎక్కువగా, లోతుగా ఉండటంతో అప్పటి పరిస్థితుల దృష్ట్యా అంత ధనం వెచ్చించి నిర్మించాల్సిన అవసరం లేదని భావించిన ప్రభుత్వం ప్రతిపాదనలను పక్కన పెట్టింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు చేసి, నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. నిర్మాణ పనులు ప్రారంభించకముందే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఏడాది తర్వాత మరలా నిర్మాణానికి ప్రభుత్వం అనుమతు లివ్వటంతో పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రానికి గేట్ వేగా ఉన్న ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం పలు ప్రతిపాదనలు చేస్తున్న నేపథ్యంలో ముక్త్యాల వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నోచుకుంది. తెలంగాణ, ఆంధ్ర నుంచి తమిళనాడుతో పాటు తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు దగ్గర మార్గంగా మారనుంది. ఇప్పటికే ముక్త్యాల కృష్ణానది ఉత్తర వాహిని క్షేత్రంగా పలు ఆలయాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో సిమెంట్ కర్మాగారాలున్నాయి. దీంతో ముక్త్యాలకు భవిష్యత్‌లో ఈ వంతెన మణిహారంగా మారుతుందని భావిస్తున్నారు.


పల్నాడు జిల్లా వైపు నిర్మిస్తున్న పిల్లర్

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 824 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,800, గరిష్ఠధర రూ.10,700, మోడల్‌ధర రూ.10,325పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,800, గరిష్ఠధర రూ.10,700 మోడల్‌ధర రూ.10,325 పలికాయి.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఫిరంగిపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫిరంగిపురం, వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాలకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ ఏఈ దుర్గాప్రసాదు మంగళవారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్‌ను నిలిపి వేస్తున్నామని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రేపు మండల పరిషత్ సాధారణ సమావేశం

వట్టిచెరుకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం మండలపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చిలకా రాజ్యం అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇచ్చారన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

తాడికొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తాడికొండలోని నార్త్ స్కూల్లో బండ్ల కోటేశ్వరరావు మిత్రమండలి ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ కళాశాల అండ్ హాస్పిటల్ సహకారంతో మంగళవారం నిర్వహించి ఉచిత మెడికల్ క్యాంపునకు మంచి స్పందన లభించింది. వైద్య శిబిరంలో 81 మంది పరీక్షలు చేయించుకోగా వారిలో 13 మందిని హాస్పిటల్‌కు తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్లు పేర్కొన్నారు. బీపీ, షుగర్, ఈసీజీ, కీళ్ల, గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోలేరమ్మకి ప్రత్యేక పూజలు

● ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ ప్రభ



పెదనందిపాడు తెలుగుయువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ

పెదనందిపాడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసరావు అమ్మవారికి విశేష పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. దీనిలో భాగంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. తెలుగుయువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ ప్రత్యేకంగా భక్తులను ఆకట్టుకుంది.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

కాకుమాను, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఎంఈవో కేవీఎ కెన్నడీ అన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో మంగళవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ తరగతులు జరిగాయి. పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మధ్యాహ్న భోజన మెనూపై అవగాహన కల్పించారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యుగకీర్తి, ఎండీఎం నిర్వాహకులు ఏర్పాటు చేసిన పోషక విలువలతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రవిబాబు, మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ హక్కుల పరిరక్షణ అధ్యక్షుడిగా సయ్యద్ మస్తాన్‌వలి

వట్టిచెరుకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడిగా సయ్యద్ మస్తాన్‌వలి, ప్రధాన కార్యదర్శి షేక్ ఈసబ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫౌండర్ ఎండీ ఫరూక్ షిబ్లీ నియామక పత్రం అందజేశారు.

కిల్కారి కాల్ సేవలు గర్భిణులు బాలింతలకు ప్రయోజనం

తుళ్లూరు జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కిల్కారి కాల్ సేవలు గర్భిణులు, బాలింతలకు ప్రయోజనమని కిల్కారి ప్రోగ్రాం ఆఫీసర్ రాజు తెలిపారు. మంగళవారం తుళ్లూరు పీహెచ్‌సీలో ఆశాలు, ఏఎన్ఎంలు, ఏఎల్‌హెచ్‌వీలు, పీహెచ్ స్టాఫ్‌కి అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం గర్భిణులు బాలింతల కోసం కిల్కారి ప్రోగ్రాం ప్రవేశపెట్టిందన్నారు. గర్భిణులు నాలుగో నెల నుంచి మొదలు పుట్టిన బిడ్డ సంవత్సరం వరకు కిల్కారి కాల్స్ వస్తాయని తెలిపారు. కేంద్రం నుంచి వచ్చే కిల్కారి కాల్ నెంబరు 01244451660 అని గర్భిణులు బాలింతలు వారి మొబైల్‌లో సేవ్ చేసుకోవాలన్నారు.

పేరుకే మండల కేంద్రం

- తహసీల్దార్, హౌసింగ్ కార్యాలయాలు మినహా.. అన్ని శాఖలు అద్దె భవనాల్లోనే
- రైతులకు సేవలందించే వ్యవసాయశాఖ కార్యాలయం కూడా లేదు
- సొంత భవనాల ఏర్పాటులో చిత్తశుద్ధి లేని ప్రజాప్రతినిధులు, అధికారులు



అధ్వాన స్థితిలో వట్టిచెరుకూరు పోలీసుస్టేషన్

వట్టిచెరుకూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాలు దాదాపు సొంత భవనాల్లోనే అధికారులు విధులు నిర్వహిస్తుండగా జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలోని వట్టిచెరుకూరులో మాత్రం అరకొర వసతులతో తహసీల్దార్ కార్యాలయం, హౌసింగ్ కార్యాలయం మినహా మిగిలిన వివిధ ప్రభుత్వ కార్యాలయాలు అద్దెభవనాల్లో చాలీచాలని ఇరుకు గదుల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయటంలో ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులకు చిత్తశుద్ధి లేదనటానికి ఇంతకంటే ఏం కావాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలో ప్రజల రక్షణ కోసం ఏర్పాటు చేసిన పోలీసుస్టేషన్ నేటికి అరకొర వసతులతో అద్దె భవనంలోనే కొనసాగుతుంది. ఇటీవల సీఐ స్థాయికి చేరుకున్న పోలీసు స్టేషన్ సిబ్బంది రాకతో రోడ్డు పైనే విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వివిధ రకాల వాహనాలు రోడ్డు పైనే నిలపాల్సి రావటం, అదీ గ్రామం నడిబొడ్డున కావటంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రైతులకు ఉపయోగపడే వ్యవసాయశాఖ, పేద విద్యార్థులకు ఉపయోగ హాస్టల్ మహిళలకు నిర్దేశించిన మండల సమాఖ్య కార్యాలయాలు నేటికి అద్దె ప్రాతిపదికనే కొనసాగుతున్నాయి. రైతులకు చేరువగా సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాల్సిన వ్యవసాయ శాఖకు కార్యాలయం లేక పోవటాన్ని, అద్దె భవనంలో కొనసాగటాన్ని గుర్తించిన వట్టిచెరుకూరుకు చెందిన ముప్పా సుబ్బారావు గ్రామానికి సమీపం లోని ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే విలువైన స్థలాన్ని సొంత ఖర్చులతో వ్యవసాయ కార్యాలయం కోసం రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. ఆ



బీసీ బాలుర హాస్టల్



నిరుపయోగంగా మహిళామండలి భవనం

సమయంలో తాను ఉండగా భవనాన్ని నిర్మిస్తే చూసి సంతోషిస్తానని ఆనాడు చెప్పినా నేటికి ఆ కల నెరవేర లేదు. ఇటీవల గుంటూరు పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుకు దాత ముప్పాళ్ళ సుబ్బారావు స్వయంగా విషయాన్ని వినతిపత్రం ద్వారా తెలియజేయటం తో పాటు బిల్డింగ్ నిర్మించకపోతే నా స్థలాన్ని నాకు రిజిస్ట్రేషన్ చేయించాలని వినతిపత్రంలో కోరారు. ఆనాడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ముఖ్యమంత్రిగా నందమూరి తారక రామారావు మండల వ్యవస్థలో దాదాపు మండల కార్యాలయాలను ఏర్పాటు చేసి సొంత భవనాలను ఏర్పాటు చేశారు. అది శిథిలావస్థకు చేరినా పట్టించుకొనే నాథుడే లేకపోవటం గమనార్హం.

తెలుగు జాతి వారసత్వ సంపద కొండవీడు

● మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి



రెడ్డిరాజుల ఖడ్గాన్ని చూపుతున్న మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి

ఫిరంగిపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : తెలుగు జాతి వారసత్వ సంపద కొండవీడు అని మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ తులసి రెడ్డి అన్నారు. మంగళవారం ఫిరంగిపురంలోని రెడ్డి రాజుల వారసత్వ ప్రదర్శనశాలను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కొండవీడు రెడ్డిరాజుల పరిపాలన, వారు ఉపయోగించిన ఆయుధ సామాగ్రి, సాహిత్య సేవ, కట్టడాలు, చెరువులు లాంటి వాటిని పరిశీలించి మరిన్ని మెరుగులు దిద్దాల్సిన అవసరం నేటి తరానికి చెందిన వారిపై ఉందన్నారు. కొండవీడు పరిరక్షణ కోసం, అభివృద్ధి కోసం కల్లి శివారెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఇక్కడ శిల్పాలు, ఘట్టాలు ఆశ్చర్య పరిచే విధంగా ఉన్నాయన్నారు. ఇక్కడి కట్టడాలు, భాషా సంస్కృతులు భావి తరాలకు అందించాల్సి ఉందన్నారు. కనుకనే ఈ ప్రాంతాన్ని యాత్రా స్థలంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఆనాడు రాజులు వాడిన ఖడ్గాన్ని, రాతి గుండును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో బొడపాటి అంజిరెడ్డి, చిలకలూరిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఎస్ రాధాకృష్ణ, సాగి నరసింహారావు, షేక్ బాజీ, సాగి మల్లికార్జునరావు, షేక్ బాజీ, తుళ్ళూరు విశ్వేశ్వరరావు, రెడ్డి నర్సిరెడ్డి, ఎండీ అక్బర్, చిట్టాల అంజిరెడ్డి, షేక్ నస్రిద్దీన్, ఇంటూరి భవానీ, వెంకటేష్, కారుచోట స్వప్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికులకు జీతాల బకాయిలు చెల్లించాలి



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు దుర్గారావు

తాడేపల్లి టౌన్ జూన్ 3 (ఆంధ్రజ్యోతి) మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలు, వంట బిల్లులు వెంటనే చెల్లించాలని యూనియన్ గౌరవ అధ్యక్షుడు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. తాడేపల్లిలో సీఐటీయూ కార్యాలయం వద్ద మంగళవారం మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం సీఐటీయూ విస్తృత సమావేశం జరిగింది ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని, కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని నెలనెలా బిల్లులు జీతాలు చెల్లించాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 9వ తేదీన దేశ వ్యాప్తంగా జరగబోయే సమ్మెలో మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని దుర్గారావు కోరారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం సీఐటీయూ తాడేపల్లి మండల గౌరవ అధ్యక్షుడిగా వేముల దుర్గారావు, అధ్యక్షురాలుగా బొక్క అనురాధ, కార్యదర్శిగా పంతాని నాగలక్ష్మి మరో ఏడుగురు తోటి మండల కమిటీ ఏర్పడింది.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

● ముప్పాళ్ల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు

మంగళగిరి సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మి, రైతు వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపుని చ్చారు. మంగళగిరి మండలం చినకాకాని గ్రామంలో సీపీఐ శాఖ మహాసభ మంగళవారం రాత్రి జరిగింది. యార్లగడ్డ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ముప్పాళ్ల మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక నల్లధనం మొత్తాన్ని తీసుకువస్తానని చెప్పిన మోదీ, ఆ నల్లధనం మొత్తాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థకు తరలించారని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని మండిపడ్డారు. రైతులు గిట్టుబాటు ధరల్లేక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నా కేంద్రానికి చీమకుట్టినట్టయినా లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని విమర్శించారు. మోదీ నియంతృత్వ విధానాలను ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తొలుత చినకాకాని సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ జెండాను రామినేని శ్రీనివాసరావు ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, నేతలు జాలాది జాన్ బాబు, జే శంకరరావు, ముద్రబోయిన శ్రీనివాసరావు, తోట వీరనారాయణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

2040 కల్లా మలేరియా రహిత సమాజం

● ప్రజల సహకారం ఉండాలి



ఆరోగ్యకేంద్రం నుంచి ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

తుళ్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 2040వ సంవత్సరం నాటికి మలేరియా రహిత సమాజం ఉండాలని తుళ్లూరు ప్రభుత్వ వైద్యురాలు టీ శివపార్వతి అన్నారు. అందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రజల సహకారం కూడా ఉంటే అది ముమ్మాటికి సాధ్యపడుతుందన్నారు. మంగళవారం మలేరియా మాసోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తీసుకుంటున్నట్టు చెప్పారు. మురుగునీరు ఇంటి చుట్టు పక్కల నిల్వ ఉండకుండా చుసూకోవాలన్నారు. దోమతెరలు వాడలన్నారు. వర్షాకాలంలో పనికిరాని కుండలు, బిందెలు తీసివేయాలన్నారు. దోమ తెరలు తప్పనిసరిగా వాడాలని ప్రజలకు డాక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోలు వెంకట రమణ, ఎంఎస్ఎం రాశి, సూపర్‌వైజర్లు సుధాకర్, డీఎస్.రెడ్డి, కె.నరసింహారావు, హెల్త్ అసిస్టెంట్‌లు కరీమ్, సుధాకర్, ఎస్ బాబు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.

పీజీ ప్రవేశ పరీక్షను వాయిదా వేయాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్‌జీ

మంగళగిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షలు జరుగుతున్న తరుణంలో పీజీ ప్రవేశ పరీక్షలు నిర్వహించడం వల్ల అభ్యర్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండెల నాసర్‌జీ చెప్పారు. పీజీ ప్రవేశ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి జాయింట్ డైరెక్టర్ కృష్ణమూర్తిని కలిసి ఏఐఎస్ఎఫ్ నేతలు వినతిపత్రం అందజేశారు. డీఎస్సీ పరీక్షల వేళ పీజీ ప్రవేశ పరీక్షలు నిర్వహించడం విద్యార్థుల జీవితంతో చెలగాటమాడటమేనని పేర్కొన్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల విద్యార్థులు గందరగోళ పరిస్థితిలోకి వెళ్లిపోతారని, అనేక మంది విద్యార్థులకు డీఎస్సీ పరీక్షల రోజునే సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా ఉందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పీజీ ప్రవేశ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివ, యశ్వంత్, ప్రణీత్, డేవిడ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

5న చలో గుంటూరును జయప్రదం చేయాలి

● రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామారావు

కాకుమాను, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పొగాకు కంపెనీల యాజమాన్యాలను నిలదీసేందుకు ఈ నెల 5న జరిగే గుంటూరులోని జీపీఐ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామారావు రైతులకు విజ్ఞప్తి చేశారు. మండలపరిధిలోని పెద్దివారిపాలెం, కొమ్మూరు గ్రామాల్లో పొగాకు మండెలను రైతు సంఘ నాయకులతో కలసి సందర్శించారు. రైతులు వ్యయ ప్రయాసలకు ఓర్చి పొగాకు సాగు చేస్తే ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం ఏమిటని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం కంపెనీ యాజమానులతో చర్చలు జరిపి రైతుల వద్ద పొగాకును కొనుగోలు చేయాలని అన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ ప్రియదర్శినికి అన్నదాత సుఖీభవ ప్రతి కౌలు రైతుకు కూడా రూ20 వేలు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జంపని రామారావు రైతు సంఘం నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, రైతు సంఘం నాయకులతో కలసి టీడీపీ నాయకుడు నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరి పట్టణంలో జరిగిన మలేరియా నివారణా మాసోత్సవ ర్యాలీలో ఏపీ టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అజయ్ జైన్, ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సిన్హా, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి, పలువురు వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. **(మంగళగిరి)**

బాల్యం నుంచే భగవద్గీత శ్లోకాల పఠనం



విమలానంద ఆశ్రమంలో భగవద్గీత శ్లోకాలు చదువుతున్న చిన్నారులు

దుగ్గిరాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత శ్లోకాల పఠనం ద్వారా బాల్యం నుంచే ప్రతికూల ఆలోచనలను నియంత్రించ వచ్చునని విమలానందాశ్రమ నిర్వాహకురాలు జంపాల కుసుమ కుమారి అన్నారు. జాగృతిఫౌండేషన్ వ్యవస్థాపకుడు పసుపులేటి గణేశ్ ఆధ్వర్యంలో వేసవిలో నెలరోజులుగా నిర్వహిస్తున్న భగవద్గీత శ్లోకాల శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పట్టుదలతో, క్రమ శిక్షణతో శ్లోకాలను శ్రద్ధగా నేర్చుకున్న చిన్నారులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. శిక్షణకాలంలో అన్నివిధాల సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బంది చిన్నారుల కోసం వైద్య పరీక్ష శిబిరాన్ని నిర్వ హించి మందులను పంపిణీ చేశారు. డాక్టర్ ఇజాజ్ అబ్దుల్‌రెహ్మాన్, విజయ్‌కుమార్, మహిళలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దుగ్గిరాల మండలం శృంగారపురంలో యోగా శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని చాటి చెబుతూ, ఈనెల 21వ తేదీన యోగా దినోత్సవం వరకూ యోగా శిబిరం కొనసాగుతుందని తెలిపారు. సర్పంచ్ కొండూరు సుధారాణి, టీడీపీ నాయకులు మొవ్వా చంద్రశేఖరరావు, అంకమరావు, కొండూరు ముత్తయ్య, సునీల్, జూపల్లి వెంకటేశ్వరరావు, గ్రామసచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. (దుగ్గిరాల)

పేదల సంక్షేమమే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం తాడికొండ ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 80 మంది లబ్ధిదారులకు రూ.57 లక్షల 39 వేల చెక్కులను పంపిణీ చేసినట్టు తెలిపారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. తల్లికి వందనం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, దీపం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నట్టు తెలియజేశారు. కూటమి అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీని నిర్వహిస్తున్నామన్నారు. పాడైపోయిన రోడ్లను బాగు చేయడానికి వేలాది కోట్ల రూపాయాలను ఖర్చు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, ధనేకుల సుబ్బారావు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు చిగురుపాటి అనూఫ్, గుంటుపల్లి మధుసూదనరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు, గొడ్డలి వేటుకు కేరాఫ్ జగన్ రెడ్డి

● పోతినేని శ్రీనివాసరావు

మంగళగిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు, గొడ్డలి వేటుకు జగన్ రెడ్డి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు విమర్శించారు. వెన్నుపోటు దినం కార్యక్రమం చేసే అర్హత జగన్‌కు ఏమాత్రం లేదన్నారు. శివకుమార్ అనే వ్యక్తి స్థాపించిన వైసీపీని కబ్జా చేసి శివకుమార్‌కు వెన్నుపోటు పొడిచారని, ఎత్తుకొని పెంచిన బాబాయ్‌ని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకుల్ని కాపాడుతూ రక్త సంబంధానికి వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. ఆస్తి కోసం తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకుని రూ.లక్షల కోట్లు దోచుకుని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీని ఏర్పాటు చేశారని ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్‌ప్లాన్ నిధులు లక్షలాది కోట్లు దారి మళ్లించి సామాజిక న్యాయానికి వెన్నుపోటు పొడిచిన జగన్‌కు వెన్నుపోటు దినం నిర్వహించే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం 70 శాతం హామీలను అమ లు చేసిందని చెప్పారు. వైసీపీ పాలనలో ధ్వంసమైన అన్ని వ్యవస్థలను సీఎం చంద్రబాబు గాడిలో పెడుతుంటే జగన్ వెన్నుపోటు దినం వంటి కార్యక్రమాలకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ ముఠా విష ప్రచారాలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని పోతినేని పిలుపునిచ్చారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

● ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా



సమావేశంలో పాల్గొన్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు

మంగళగిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదీన జరుగనున్న చలో విజయవాడ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా కోరారు. సంఘం మంగళగిరి తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. చాంద్‌బాషా మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలే ప్రధాన ఎజెండాగా కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 5న జరిగే సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ హాజరవుతున్నారని తెలిపారు. అనంతరం చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం గుంటూరు నగర శాఖ అధ్యక్షుడు వై నాగేశ్వరరావు, నేతలు పెదరత్తయ్య, మురళీ, మాధవరావు, శ్యామ్, యశోదరావు, సుభాషిణి పాల్గొన్నారు.

● తుళ్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తుళ్లూరు పీహెచ్‌సీలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా అధ్యక్షతన ఉద్యోగుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ జూన్ 5వ తేదీన చలో విజయవాడ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగర శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదరత్తయ్య, తాడికొండ తాలూకా యూనిట్ సుబ్బారావు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా మహిళా విభాగం ఆర్గనైజింగ్ కార్యదర్శి రమణ, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో బ్రహ్మేశ్వర స్వామి

వట్టిచెరుకూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : వట్టిచెరుకూరు గ్రామంలోని గంగా భ్రమరాంబిక సమేత బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం నుంచి 6వ తేదీ వరకు స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయాన్ని నూతన రంగులతో శోభాయమానంగా తీర్చిదిద్దగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం పుట్టమట్టి తేవటం, ఆకురారోహణ, ధ్వజస్తంభం వద్ద మహారుద్రాభిషేకం జరగనున్నాయి. 5వ తేదీ స్వామి వారిని పెండ్లి కుమారుడిని చేయటం, భ్రమరాంబికదేవి, గంగాదేవీలను పెళ్లి కుమార్తెలను చేయటం, స్వామి విగ్రహ ప్రతిష్ఠ రోజు సందర్భంగా ఈ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు వివరించారు. 6వ తేదీ సాయంత్రం దివ్య రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు పుష్పయాగం

దుగ్గిరాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 4వతేదీన విశేషంగా పుష్పయాగం నిర్వహించనున్నారు. ఉదయం స్వామికి పలురకాల అభిషేకాలు పూజాకార్యక్రమాల అనంతరం అత్యంత ప్రీతిపాత్రమైన పుష్పాలతో పుష్పయాగం జరుపనున్నట్లు అర్చకులు సాకేత్, రామచంద్ర తెలిపారు. కొంగర జోగేంద్రప్రసాద్, నాగరాజకుమారి దంపతులతో ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైన పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

జనసేన సభ్యత్వ నమోదుతో ప్రమాద బీమా సౌకర్యం

● ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి చట్టాల త్రినాథ్

కాకుమాను, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జనసేన సభ్యత నమోదు వల్ల ప్రమాద బీమా రూ.ఐదు లక్షల పరిహారం ఇస్తున్న పార్టీ జనసేన అని ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి చట్టాల త్రినాథ్ అన్నారు. మండల పరిధిలోని పాండ్రపాడులో మంగళవారం సభ్యత్వ నమోదు కిట్‌లను అందించారు. ఈ సందర్భంగా చట్టాల త్రినాథ్ మాట్లాడుతూ ప్రతి జనసేన కార్యకర్త కుటుంబ సభ్యుడేనని స్పష్టం చేశారు. ప్రజల్లో జనసేనపై అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. సభ్యత్వ నమోదు వల్ల ఒక భరోసా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసరావు, పుప్పాల పూర్ణచంద్రరావు, గ్రామ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఇక్కుర్తి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

మోడల్ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

● ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ఈ నెల 12వ తేదీ నుంచి పునఃప్రారంభం కానున్నాయని తల్లిదండ్రులు తమ పిల్లలను మోడల్ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. మంగళవారం విద్యాభవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో మున్నంగి, వల్లభాపురం, కొల్లిపర గ్రామాల్లో మూడు ప్రాథమిక పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఒక్కొక్క మోడల్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిని, నలుగురు ఉపాధ్యాయులను కేటాయించడం జరిగిందని తెలిపారు. తరగతికి ఒక ఉపాధ్యాయుడు విద్యాబోధన చేయనున్నట్లు తెలియజేశారు. మోడల్ స్కూల్స్‌లో అనేక మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. మోడల్ స్కూల్స్‌లో చేరిన విద్యార్థులకు సంబంధించిన పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఆర్పీలు పిడపర్తి రమేష్‌బాబు, వి.మురళి, అలేఖ్య, స్వరూపరాణి, రాంబాబు, సురేష్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



సాధించిన బహుమతులతో క్రీడాకారిణి రేవతి

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రేవతికి బంగారు పతకం

తెనాలి అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి సబ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తెనాలి క్రీడాకారిణి వక్కలగడ్డ రేవతి సత్తా చాటింది. రెండు రోజుల పాటు జరిగిన చాంపియన్‌షిప్ పోటీల్లో 76కిలోల విభాగంలో స్క్వాడ్ 140 కేజీ, బెంచ్ ప్రెస్ 50కేజీ, డెడ్ లిఫ్ట్ 150కేజీ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. అన్‌ఎక్విప్‌డ్ విభాగంలో స్క్వాడ్ 135 కేజీ, బెంచ్‌ప్రెస్ 45 కేజీ, డెడ్ లిఫ్ట్ 140 కేజీ పోటీల్లో కూడా మొదటి స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు కైవసం చేసుకున్న రేవతిని తెనాలికి చెందిన క్రీడాభిమానులు అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

తెనాలి, మారీసుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతిచెందిన ఘటన తెనాలిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ముత్తెంశెట్టిపాలెంలో ఒంటరి మహిళ తాడిపర్తి నాగమల్లేశ్వరి (63) టిఫిన్‌బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. మంగళవారం ఉదయం టిఫిన్‌బండి పెట్టకపోవడంతో అదేప్రాంతంలో నివసిస్తున్న కుమార్తె నాగలక్ష్మి తల్లి ఇంటికి వెళ్లింది. లోపలకి వెళ్లి చూడగా మంచంపై తల్లి మృతిచెంది ఉండటాన్ని గుర్తించింది. ఇంట్లో బీరువా కూడా తెరిచి ఉండగా అందులోని 63 గ్రాముల నగలు, నగదు అపరణకు గురైనట్లు గుర్తించింది. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రివేళలో ఇంట్లోకి చొరబడి దొంగతనానికి ప్రయత్నించే క్రమంలో తన తల్లిని కూడా చంపి ఉండవచ్చు అని కుమార్తె అనుమానం వ్యక్తం చేసింది. దీనిపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్‌టీంతో ఘటనా స్థలానికి చేరి వివరాలు సేకరిస్తున్నారు. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు వెలుగుచూడాల్సి ఉంది. చిరువ్యాపారిగా పరిసర ప్రాంత ప్రజలతో కలివిడిగా ఉండే నాగమల్లేశ్వరి ఆకస్మికంగా మృతి చెందడంతో ఆప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు నిర్వహించారు. మంగళవారం బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మాగాంధీ శాంతి వృద్ధాశ్రమంలో ఎస్‌వీ యోగా సభ్యులు అద్దెపల్లి సోమసుందర సాంబశివ సుబ్రహ్మణ్యం 61వ జన్మదినోత్సవం సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాబక్తుని రమణయ్య, అనూష, జగదీశ్వరి, ఏసుబాబు, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏపీజీఈఏ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

● బాలచంద్రమౌళి

కొల్లిపర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 5వ తేదీన విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్ బందర్ రోడ్డులో జరుగనున్న ఏపీజీఈఏ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ఉద్యోగులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఏపీజీఈఏ దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందె బాలచంద్రమౌళి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీజీఈఏ సంఘ నాయకులు గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బాలచంద్రమౌళి మాట్లాడుతూ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యల గురించి చర్చించడంతో పాటు ఉద్యోగులు, కార్మిక పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు తెలిపారు. సమావేశంలో సబ్‌రిజిస్ట్రార్ ఆదినారాయణరెడ్డి, పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, ఏఎస్‌వో మనోహర్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ భార్గవ్, దుగ్గిరాల యూనిట్ ఉపాధ్యక్షుడు గుంటూరు పూర్ణచంద్రప్రసాద్, షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలపాడు బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం ఎప్పుడు..?

● గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ1.20 కోట్ల నిధుల మంజూరు
● నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు
● గత ఏడాది వర్షాల్లో ముగ్గురు మృతి
● సత్వరం పనులు ప్రారంభించాలని గ్రామస్థుల విజ్ఞప్తి



గత ఏడాది భారీ వరదలు వచ్చినప్పుడు కాపలాగా ఉన్న కానిస్టేబుల్ (ఫైల్ ఫొటో)

పెదకాకాని, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలవుతుందంటే పలు గ్రామాల ప్రజల గుండెల్లో రైలు పరిగెత్తుతున్నాయి... భారీ వర్షం కురిస్తే ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్ళటం కష్టంగా మారుతోంది... అందుకు ప్రధాన కారణం ఉప్పలపాడు సమీపంలో ఉన్న భారీ వాగు.... ఈ వాగులో నుంచి గుంటూరు నగరానికి చెందిన మురుగు కూడా వెళ్తుంది. ఎంతో ప్రాధాన్యం కలిగిన ఈ వాగు గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఉప్పలపాడు చెందిన ఇద్దరు చిన్నారులతో పాటు ఒక ఉపాధ్యాయుడిని మింగేసింది. ఆ విషాదం గ్రామంలో ఇప్పటికీ పలువురి మనస్సులోంచి చెరిగిపోలేదు. అప్పుడు బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌లను గ్రామస్థులు ఈ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. దీంతో వారు వెను వెంటనే అంచనాల పూర్తి చేసి 1.20కోట్ల రూపాయలను మంజూరు చేయించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. దీంతో ఉప్పలపాడు గ్రామస్థులు ఈ ఏడాది వర్షాకాలంలో వాగు ఏవిధంగా ఉంటుందోనని భయపడుతున్నారు.

తెనాలి పర్యటనతో జగన్ నిజస్వరూపం బట్టబయలు

ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు సొపాటి కిరణ్



విలేకరుల సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

తెనాలి రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లగా ఉన్న యువకులకు అండగా నిలుస్తానంటూ జగన్ తెనాలి వచ్చిన తీరుతో ఆ పార్టీ నిజస్వరూపం బట్టబయలైందని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు సొపాటి కిరణ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జగన్ పర్యటనను ఖండిస్తూ ఆ పార్టీ ఎస్సీ సెల్, బీసీ సెల్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ తెనాలి ఐతానగర్‌లో పోలీస్‌పై హత్యాయత్నం చేసిన నిందుతులకు మద్దతు తెలుపుతూ జగన్ పర్యటించడం సమాజంలో అశాంతిని ప్రేరేపించడమేనన్నారు. రౌడీమూకల దాడిలో గాయపడిన కానిస్టేబుల్ కుటుంబాన్ని కనీసం పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. ఏదో విధంగా కూటమి ప్రభుత్వ పాలనను ప్రజల్లో దిగజార్చాలని చేసే ప్రయత్నం తప్ప సమాజానికి మంచి జరగాలన్న ఆలోచన జగన్‌కు లేనట్టు ఈ పర్యటనతో స్పష్టమవుతుందన్నారు. అనేక కేసుల్లో నేరస్థులుగా ఉన్న యువకులకు మద్దతు తెలపడమే కాక కులం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడటం జగన్ దిగజారుడు తనానికి అద్దం పడుతుందన్నారు. రాష్ట్ర ఐటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మల్లవరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబుపై 24 కేసులున్నాయని అన్న జగన్ తనపై ఉన్న 33 కేసులను ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు జగన్ చేస్తున్న ప్రయత్నాలు ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. బీసీ సెల్ అధ్యక్షుడు గిరిగణేష్ మాట్లాడుతూ జగన్ బాధితులకు కాక బాధించే వారికి సపోర్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు అత్తోట శరత్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు కోపల్లె శ్రీను, పనిదపు దుర్గ, డేవిడ్, రవీంద్ర, కొమ్యూరి వెంకటేశ్వర్లు, గోపి, రాజేంద్రప్రసాద్, కిరణ్, అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకం కింద

పెట్టుబడి సాయం రూ.20వేలు అందించాలి

● తహసీల్దార్‌కు సీఐటీయూ నాయకుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

తెనాలి రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు, కౌలు రైతులకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20వేలు పెట్టుబడి సాయం అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ కోరారు. మంగళవారం ఈ మేరకు మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాబుప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. గత సంవత్సరం రైతులకు పెట్టుబడి సాయం అందించలేదన్నారు. ఈ ఏడాదైనా ఖరీఫ్ ప్రారంభానికి ముందే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలన్నారు. నూటికి 70 నుంచి 80శాతం కౌలు రైతులున్నారని వారందరికీ సీసీఆర్సీ కార్డులు అందక రుణాలు, ప్రభుత్వసాయం అందక నష్టపోతున్నారని ఆరోపించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు తక్కువ రేటుకు అమ్మి నష్టపోయే పరిస్థితి ఉందని వివరించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరచి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు హుస్సేన్ వల్లి, నాగరాజు, వేజెండ్ల తబిత, తెనాలి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

షటిల్, బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు బహుమతులు

తెనాలి రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన పట్టణ స్థాయి షటిల్, బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఏ, బీ, సీ కేటగిరిల్లో జరిగిన పోటీల్లో పలువురు క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. వారిలో గెలుపొందిన క్రీడాకారులు సాత్విక్, రాజ్యలక్ష్మి, రమ్య, తేజ, జ్యోతిష్, కార్తికేయన్, చరణ్‌కిషోర్, సత్య, సాత్విక్ శంకర్, జీషన్. కార్తిక్, పునీత్‌రాజీవ్, దర్శిత్, ప్రణీత్, సందీప్, కృష్ణార్జునలను త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు అభినందించి బహుమతులు అందజేశారు. కోచ్ ఎస్.వినయ్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో రిఫరీలుగా అనురూప్, విజ్ఞాన్, సాయిచరన్, శ్రీమన్నారాయణ, మోజస్ వ్యవహరించారు. హ్యాండ్‌బాల్ కోచ్ నాగరాజు, రవిశంకర్, లోకేష్, బోస్, శ్రీనివాస్, లలిత సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సైనికుడు - సేవకుడు పుస్తకం కవర్‌పేజీ ఆవిష్కరణ



పుస్తకం కవర్ పేజీని ఆవిష్కరిస్తున్న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ

తెనాలి అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సైనికుడు - సేవకుడు పుస్తకం కవర్‌పేజీని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశామని మాజీ సైనిక సంక్షేమ సంఘం కార్యదర్శి ఐనంపూడి రత్నప్రసాద్ తెలిపారు. మాజీ సైనికుడు, ప్రజా సేవకుడు సీబీఆర్ ప్రసాద్ జీవిత చరిత్రపై ఈ పుస్తకాన్ని ముద్రిస్తున్నట్లు తెలిపారు. సైనికుడిగా పని చేసిన ప్రసాద్ రక్షణ శాఖకు కోటి 8లక్షల రూపాయలు విరాళం ఇచ్చారని చెప్పారు. రూ.30కోట్ల వ్యయంతో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేశారని, కరోనా సమయంలో అంబులెన్స్ సమకూర్చారని చెప్పారు. ఆయన సేవలు ఈ పుస్తకంలో పొందుపరుస్తున్నామన్నారు.

2030 నాటికి క్షయరహిత భారత్ ఆవిష్కరణ: కలెక్టర్

గుంటూరు మెడికల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 2030 నాటికి దేశంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు కలెక్టర్ భార్గవ్‌తేజ వెల్లడించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో టీబీ ముక్త భారత్ అభియాన్ పోస్టర్లను, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలలో భాగంగా జిల్లాలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటి సర్వే నిర్వహించి హైరిస్క్ పాపులేషన్‌కు క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 60 ఏళ్ల పైబడ్డ వృద్ధులు, బీఎంఐ 18కంటే తక్కువగా ఉన్న వారికి, మద్యం, పొగ తాగే అలవాటు ఉన్న వారికి, గతంలో టీబీ వచ్చి తగ్గిన వారికి, గర్భిణీలు, షుగర్, బీపీ ఉన్న వారికి, హెచ్ఐవీ పాజిటివ్‌లకు క్షయ పరీక్షలు నిర్వహిస్తారని ఆయన వెల్లడించారు. ఎవరికైనా క్షయ సోకినట్లు తేలితే వారికి ఆరు నెలల పాటు ఉచితంగా చికిత్సలు అందజేస్తామన్నారు. చికిత్స సమయంలో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కోసం రూ.వెయ్యి ప్రతి నెల వారి బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తామన్నారు.

ఆవుల అక్రమ రవాణా అడ్డగింత

పొన్నూరు టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జూపూడి గ్రామం నుంచి మూడు ఆటోలలో ఆవులను అక్రమంగా తరలించడం గమనించిన స్థానికులు మంగళవారం అడ్డుకున్నారు. మండల పరిధిలోని జూపూడి, మన్నవ గ్రామాల మధ్య గత కొద్ది రోజులుగా తెలంగాణ నుంచి ఆవుల మంద వచ్చి పంట పొలాల్లో మేపుతున్నారు. అయితే మంగళవారం మూడు ఆటోలలో 15 ఆవులను ఎక్కించి గుంటూరు వైపు తరలిస్తుండగా మన్నవ, జూపూడి, దొప్పలపూడి గ్రామాలకు చెందిన రైతులు ఆవుల రవాణాను అడ్డుకున్నారు. ఆవులను అక్రమంగా కబేళాకు తరలిస్తున్నారనే అనుమానంతో అడ్డుకోవడమే కాకుండా రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్ఐ కిరణ్ సంఘటన స్థలానికి చేరుకుని ఆవులను తరలిస్తున్న ఆటోల డ్రైవర్‌లను ప్రశ్నించి గ్రామస్థుల సమక్షంలో ఆటోలో నుంచి ఆవులను దింపి మందలో కలిపారు. ఆవుల అక్రమ రవాణా గురించి తెలుసుకున్న బీజేపీ, వీహెచ్‌పీ సంఘాలు సంఘటన స్థలానికి వెళ్లగా పోలీసులు నచ్చజెప్పి రవాణాను అడ్డుకున్నామని తెలిపి అక్కడ నుంచి పంపించి వేశారు.



గ్రామస్థులు అడ్డుకున్న ఆవులు తరలిస్తున్న ఆటో

శేకూరు బ్రాంచ్ కాలువలో పూడిక తీత ప్రారంభం



శేకూరు బ్రాంచి కాలువలో పూడికతీస్తున్న ఎక్స్‌కవేటర్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శేకూరు బ్రాంచి కాలువలో పూడికతీత పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. గ్రామంలో శేకూరు బ్రాంచి కాలువలో గత కొన్నాళ్లుగా పూడికతీత పేరుకుపోయి పిచ్చిచెట్లు మొలచి అధ్వానంగా తయారైంది. బ్రాంచి కాలువ నుంచి పంట భూములకు సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువ చివరి ప్రాంతమైన శలపాడు, గ్రామంలో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా కాలువ పూడిక పేరుకుపోవడంతో పైనుంచి వచ్చే సాగు నీరు ప్రవాహం దిగువకు పారక ఎగువ పంట భూములలోకి పారి పంట పొలాలను ముంచెత్తుతోంది. శలపాడు గ్రామ రైతులు ఈ సమస్యను ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో సాగునీటి సంఘం అధ్యక్షుడు కంచర్ల శేషగిరిరావు ఆధ్వర్యంలో కాలువ పూడికతీత పనులు ప్రారంభించారు. పూడికతీత పూర్తయితే దిగువ పంట భూములకు కూడా సాగు నీరు సకాలంలో అందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాధిక తదితరులు

పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. మంగళవారం మారీసుపేట 22, 24వ వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్నతో కలసి సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లకు శంకుస్థాపన పనులకు భూమి పూజను నిర్వహించి కొబ్బరికాయ కొట్టి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ పట్టణంలో అన్ని వార్డుల్లో అభివృద్ధి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పనులను ప్రారంభించామన్నారు. అందులో భాగంగా 22, 24వ వార్డుల్లో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లుకు రూ.32.30లక్షలతో పనులను ప్రారంభించామన్నారు. అభివృద్ధి చెందిన పట్టణాలకు దీటుగా తెనాలి పట్టణాన్ని కూడా అభివృద్ధి చేసుకుందామన్నారు. ప్రజల సహకారంతోనే అది సాధ్యమౌతుందన్నారు. ప్రజలు పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పెదలంక లక్ష్మీలావణ్య, షేక్ మహబూబ్‌బాషా, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ ఇంజనీర్ ఆకుల శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ సూరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్, జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం తదితరులు

మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలి, మారీసుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు మలేరియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం అన్నారు. మంగళవారం పద్మసాలిపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ దివి కిషోర్‌కుమార్ సిబ్బందితో కలసి మలేరియా నివారణ మాసోత్సవ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పాల్గొని మలేరియా వ్యాధిపై అవగాహన కలిగించారు. అనంతరం మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దివి కిషోర్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో మలేరియా మనతోనే అంతం కావాలని నినాదాలుచేసి మానవహారంగా నిలిచి మలేరియా అంతానికి కృషిచేస్తామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో మలేరియా, ఫైలేరియా అధికారులు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి

డ్వాక్రా మహిళలు ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చుకోవాలి

● డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి

కొల్లిపర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే సద్వినియోగించుకుని ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చుకోవాలని డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చివలూరు, కొల్లిపర గ్రామాల్లో పొదుపు సంఘాల సభ్యులకు ఆమె సమీక్ష నిర్వహించారు. పొదుపు సంఘాల సభ్యులకు బ్యాంకు రుణాలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తే మరలా రుణాన్ని పొందటానికి అవకాశం ఉందన్నారు. డ్వాక్రా మహిళలు పొదుపు ఎక్కువ చేసుకుంటే ఎక్కువ రుణాలు పొందటానికి వీలుకలుగుతుందన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు ప్రతి నెల సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో సీసీలు విజయకుమార్, మధు, పూర్ణయ్య, ఎంఎస్‌ఏ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.